విశాఖ ఆర్‌వో సబ్‌రిజిస్ట్రార్‌గా మోహనరావు

విశాఖ రిజిస్ట్రేషన్ కార్యాలయం (సూపర్‌బజార్) సబ్‌రిజిస్ట్రార్‌గా ఎస్.మోహనరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలి బదిలీల కౌన్సెలింగ్‌లో సబ్‌రిజిస్ట్రార్ సంజీవయ్యను మొదట నియమించారు. ఆయనపై పలు ఆరోపణలు ఉండటంతో ఆ బదిలీ ఉత్తర్వులను ఉన్నతాధికారులు రద్దు చేశారు. -ఈనాడు, విశాఖపట్నం

గుప్పెడంత గుండె.. దడదడ..!
చెవికి లేదా విశ్రాంతి..
ప్రత్యేక కథనాలు 18లో



ఉక్కు పరిరక్షణకు నేడు పాదయాత్ర

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కు పరిరక్షణ కోరుతూ ఒప్పంద కార్మిక సంఘం (సిటూ) ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు కూర్మన్నపాలెం దీక్షా శిబిరం నుంచి ప్రారంభమై.. వడ్లపూడి మీదుగా పెదగంట్యాడ వరకు సాగుతుందని కార్మిక నాయకులు శనివారం తెలిపారు. కార్మికుల తొలగింపులు ఆపాలని, కర్మాగారాన్ని పూర్తిస్థాయిలో నడపాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, సకాలంలో జీతాలు చెల్లించాలనే డిమాండ్‌తో పాదయాత్ర సాగుతుందన్నారు.



ఆధ్యాత్మిక శిఖరం.. ప్రకృతి రమణీయం

ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం సింహాచలం అప్పన్న కొండపై ఎటు చూసినా పచ్చదనం అలరిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు గిరులన్నీ హరితమయం అయ్యాయి. రాష్ట్రంతో పాటు...ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో వస్తున్న భక్తులు ఇక్కడి ఆహ్లాదకర వాతావరణం చూసి పరవశించిపోతున్నారు. వరాహ లక్ష్మీనరసింహుని దర్శనం అనంతరం కొండపై చూడముచ్చటైన ప్రాంతాల్లో గుర్తుండిపోయేలా ఫొటోలు దిగుతున్నారు. - ఈనాడు, విశాఖపట్నం











ఇసుక మేట.. కష్టాల బాట

ఏయూ మెరైన్ మైదానంలో జరుగుతున్న 'దివ్యాంగుల మేళా'కు శనివారం వచ్చిన వారికి దారిలో ఇక్కట్లు తప్పలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు పోలీస్ అతిథి గృహం వద్ద పైనుంచి కొట్టుకొచ్చిన ఇసుక మేట వేసింది. ఇక్కడ దివ్యాంగులు నడవాలన్నా, వాహనాలపై వెళ్లాలన్నా చెమటోడ్చాల్సి వచ్చింది. వీరే కాదు...ఈ మేళా వీక్షణకు ద్విచక్ర వాహనాలపై వచ్చిన వారికీ చుక్కలు కనిపించాయి. మేళా మరికొన్ని రోజులు జరగనున్న నేపథ్యంలో ఈ అవస్థలు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

-ఈనాడు, విశాఖపట్నం



దేవాదాయశాఖ ఏసీగా అన్నపూర్ణ బాధ్యతల స్వీకరణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ)గా టి.అన్నపూర్ణ శనివారం ఉదయం టర్నర్‌చౌల్ట్రీ ఆవరణలోని ఏసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా ఏసీగా పనిచేస్తున్న బదిలీపై ఆమె విశాఖ వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శిరీషను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. 1991లో దేవాదాయశాఖలో జూనియర్ సహాయకురాలిగా చేరిన ఆమె అంచెలంచెలుగా ఉద్యోగోన్నతులు పొందుతూ 2019లో సహాయ కమిషనర్ స్థాయికి ఎదిగారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామ రాజు జిల్లాల సహాయ కమిషనర్‌గా పనిచేశారు. విజయనగరం పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓగా బాధ్యతలు నిర్వహించారు. విశాఖ ఏసీగా బాధ్యతలు చేపట్టిన అన్నపూర్ణను నగరంలోని వివిధ ఆలయాల ఈఓలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆలయాల నిర్వహణ, భక్తులకు సౌకర్యాల కల్పన, ఆస్తులు, భూముల పరిరక్షణపై దృష్టి సారిస్తామని, ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తామని అన్నపూర్ణ తెలిపారు.



అన్నపూర్ణను అభినందిస్తున్న వివిధ ఆలయాల ఈఓలు

శిక్షణ ఐపీఎస్‌ల బృందం పోర్టు సందర్శన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: భారత దర్శన్‌లో భాగంగా నార్త్ ఈస్టర్న్ పోలీస్ అకాడమీ డిప్యూటీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనేమిచంద్ బేజియా ఆధ్వర్యంలో 15 మంది శిక్షణ ఐపీఎస్‌ల బృందం శనివారం విశాఖ పోర్టును సందర్శించింది. పోర్టు అధికారులు ఈ బృందానికి సాదరంగా స్వాగతం పలికారు. పోర్టులో జరుగుతున్న వివిధ కార్యక్రమాలు, ఎగుమతులు, దిగుమతులు, వ్యాపార అవకాశాలు వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పోర్టు ఇచ్చిన ఆతిథ్యానికి ఈ బృందం ధన్యవాదాలు తెలిపిందని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు.



పోర్టు ఆవరణలోని మస్టర్ స్టేషన్ వద్ద శిక్షణ ఐపీఎస్‌ల బృందం

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బాలికను ప్రేమించాలని వేధిస్తూ ఆమె వెంటపడిన యువకుడిని మూడో పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. చైతన్యనగర్‌కు చెందిన ముస్తాఫా (20) మురళీనగర్‌కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని వెంటపడుతూ తనను ప్రేమించాలని వేధిస్తున్నాడు. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అతనిపై ఈనెల 26న మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సి.ఐ. రమణయ్య కేసు నమోదు చేసి శనివారం ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు. ముస్తాఫా ఖాన్ ఓ ఆహార సరఫరా సంస్థలో పార్ట్‌టైమ్‌గా పనిచేస్తున్నాడు.

'హక్కుల్ని హరిస్తే సహించం'

ఉక్కునగరం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉక్కు యాజమాన్యం కలిసి కార్మికుల హక్కుల్ని హరించేలా వ్యవహరిస్తే సహించేది లేదని సిటు నాయకులు హెచ్చరించారు. ఉక్కు పరిరక్షణ కోరుతూ కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరంలో శనివారం సిటు సభ్యులు అయోధ్యరామ్ తదితరులు కూర్చున్నారు.

'టెట్'కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో అక్టోబరు 3 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏడు కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలో ఒక కేంద్రం కలుపుకొని 8 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. వీటికి ప్రత్యేక అధికారులు, స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 60,574 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఫొటో లేని హాల్ టికెట్‌తో వచ్చే అభ్యర్థులను పరీక్ష కేంద్రం వద్ద ఫొటోతో కూడిన గుర్తింపు పత్రం, తాజా ఫొటోను పరిశీలించి అనుమతించనున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన దివ్యాంగుల కోసం అదనంగా 50 నిమిషాల సమయం కేటాయించినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణలో అనుమానాల నివృత్తికి ఉదయం 7.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు కమాండ్ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని వివరించారు. డీఈఓ చంద్రకళ, ఎస్ఎస్ఏ ఏపీసీ బి.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్. చిత్రంలో డీఈఓ చంద్రకళ

రాష్ట్రస్థాయి ప్రయోగశాలలో ఒక్క పరీక్ష జరగలేదు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రూ. 30 కోట్లతో నిర్మించిన ఆహార ప్రయోగశాలలో ఇప్పటి వరకు ఒక్క పరీక్ష కూడా నిర్వహించలేదని భాజపా జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పేర్కొన్నారు. పెదవాల్తేరు ఇ.ఎన్.టి. ఆసుపత్రి దరి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఆహార ప్రయోగశాలను శనివారం భాజపా నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ప్రధాని వర్చువల్‌గా ఈ ప్రయోగశాలను ప్రారంభించినా ఇప్పటి వరకు సేవలకు నోచుకోలేదన్నారు. ఎఫ్‌ఎస్ఎస్ఏఐ దీనిపై ప్రశ్నిస్తున్నా, జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు ధనేశ్వరరావు, మురళీమోహన్ రాజు, వెంకటేశ్వరరావు, మహమ్మద్ గౌస్, ఎన్.దుర్గరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రయోగశాల వద్ద భాజపా జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, తదితరులు

'మహాత్మా గాంధీ ఆసుపత్రికి ప్రపంచస్థాయి పురస్కారం'

ఈనాడు డిజిటల్, విశాఖపట్నం: విశాఖలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రపంచస్థాయి పురస్కారం లభించినట్లు సంస్థ ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ప్రపంచ 4వ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నగరంలోని వివిధ ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు తదితరుల సహకారంతో అనేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాం. 'క్లోజ్ ది కేర్ గ్యాప్' నినాదంతో క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం, వ్యాధిని ముందుగా గుర్తించడం, మెరుగైన సంరక్షణ పద్ధతులు తదితరాలు మంచి ప్రభావం చూపాయి. దీనికిగాను ఆసుపత్రికి యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ (యూఐసీసీ) ప్రపంచంలోనే మూడో సంస్థగా గుర్తించింది. ప్రపంచ క్యాన్సర్ కాంగ్రెస్ సందర్భంగా జెనీవాలో జరిగిన సదస్సులో ఈ అంశాన్ని ప్రకటించింది. ఆసియాలో ఇలాంటి గుర్తింపు పొందిన ఏకైక సంస్థగా మా ఆసుపత్రి నిలిచింది. రాబోయే రోజుల్లో 'బ్రెస్ట్ డిజార్డర్స్' కోసం రాష్ట్రంలోనే తొలి సంస్థను ఏర్పాటుచేస్తాం' అని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎం.మురళీకృష్ణ

త్రిఫ్ట్ సొసైటీ సభ్యులకు ఆర్థిక ప్రయోజనం

ఉక్కునగరం (స్టీల్‌ప్లాంట్ సెక్టార్-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగార త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి 24 శాతం డివిడెండ్ చెల్లించేందుకు సర్వసభ్య సమావేశం ఆమోదించిందని సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనందకుమార్ తెలిపారు. శనివారం సొసైటీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 12,993 మంది సభ్యులు కలిగిన సొసైటీ రూ.367 కోట్ల టర్నోవర్‌తో ప్రగతి పథంలో దూసుకెళ్తుందన్నారు. సభ్యులు డి.శ్రీరామచంద్రమూర్తి, డి.వి.వి.ఎస్.ఎస్.కొండరాజు, కె.శ్రీనివాస్, వి.జె.మహార్, చీఫ్ మేనేజర్ కె.దామోదరరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

'మెప్మా మార్కెట్' ప్రారంభం

కరాస, న్యూస్‌టుడే: మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, మహిళలను సాధికారత సాధ్యమవుతుందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. శనివారం గోపాలపట్నం రైతుబజారులో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన 'మెప్మా అర్బన్ మార్కెట్'ను ప్రారంభించారు. అనంతరం వివిధ స్టాల్స్‌ను పరిశీలించి, మహిళలతో మాట్లాడారు. కార్యక్రమంలో జోన్-8 కమిషనర్ హైమావతి, 89వ వార్డు కార్పొరేటర్ వెంకటరమణ, బజారు ఎస్టేట్ అధికారి నారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ఊడిపడిన ఐసీపీఎస్ కార్యాలయ సీలింగ్

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖలోని జిల్లా సమగ్ర బాలల సంరక్షణ విభాగం(ఐసీపీఎస్) కార్యాలయంలోని పైకప్పు (సీలింగ్) ఒక్కసారిగా ఊడిపడిపోయింది. గత కొంతకాలంగా సీలింగ్ నిర్వహణ ప్రమాదకరంగా మారినా ఎవరూ పట్టించుకోలేదు. శుక్రవారం రాత్రి సీలింగ్ పెచ్చులూడి పడటంతో కిందనే ఉన్న బల్లలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో కార్యాలయంలో ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. సిబ్బంది శనివారం ఉదయం కార్యాలయానికి వచ్చి చూసే సరికి ఈ సీలింగ్ ఊడి కింద పడి ఉంది.



ఊడిపడిన సీలింగ్

చికెన్ ధరలు
(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్డ్	187	206
స్కిన్‌లెస్	213	216

హోమియో ఆసుపత్రి తాత్కాలిక భవనంలోకి మార్పు

కృష్ణానగర్(వేపగుంట), న్యూస్‌టుడే: కృష్ణానగర్ ప్రధాన రహదారిలో ఉన్న హోమియో ఆసుపత్రిని శనివారం స్థానిక రాధాకృష్ణ ప్రయివేటు భవనంలోకి తాత్కాలికంగా మార్చారు. ప్రస్తుత ఆసుపత్రి భవనం శిథిలమవ్వడంతో దాన్ని పూర్తిగా తొలగించి జీవీఎంసీ నిధులు రూ.31.50లక్షలతో కొత్త భవనం నిర్మించనున్నారు. నూతన కట్టడం అందుబాటులోకి వచ్చేవరకు ప్రయివేటు భవనంలో వైద్యసేవలు అందించనున్నట్లు కార్పొరేటర్ రాపర్తి కన్నా, హోమియో వైద్యుడు వై.చంద్రశేఖర్ తెలిపారు.

పెందుర్తి

– న్యూస్‌టుడే, పెందుర్తి

సమస్య: జీవీఎంసీ 96వ వార్డు ఏకలవ్య కాలనీలో 329బి/6/2, పెందుర్తి ప్రసాద్‌నగర్‌లో 195బి/12 స్తంభానికి ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. శివారు ప్రాంతాలు కావడంతో రాత్రివేళ చీకట్లో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

– పింద్రిక రాము, ఏకలవ్య కాలనీ, ఎ.సత్యనారాయణ, ప్రసాద్‌నగర్

సమాధానం: మీ ప్రాంతాల్లో వెలగని వీధి దీపాలకు త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– శివ రామ్‌ప్రసాద్, ఏఈ, 96వ వార్డు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

■ సంప్రోక్షణ పూజల్లో పాల్గొనండి

వేపగుంట, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ అపవిత్రంపై ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన సంప్రోక్షణ దీక్షలో భాగంగా చివరి మూడు రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామని ప్రజలంతా పాల్గొని సంఘీభావం తెలపాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శనివారం పిలుపునిచ్చారు. జీవీఎంసీ 94వ వార్డు జనసేన అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి, నాయకులు తనకాల శ్రీను, మోటూరు తేజ, చక్కా శ్రీను సారథ్యంలో వేపగుంట ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం సంప్రోక్షణ దీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే పంచకర్ల పాల్గొని మాట్లాడారు. గత 7 రోజులుగా పలు ఆలయాల వద్ద దీక్షలు చేశామని చివరి మూడు రోజులు నగర సంకీర్తన, మంత్రజపం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త నాగబాబు, జిల్లా తెదేపా ఆర్గనైజింగ్ కార్యదర్శి శోభారాణి, నియోజకవర్గం భాజపా సమన్వయకర్త గొర్లె రామునాయుడు పాల్గొన్నారు.

■ జీవితంలో విద్యార్థి దశ కీలకం

సబ్బవరం, న్యూస్‌టుడే: జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ గుర్రెపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కళాశాల స్వాగత వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చేసే తప్పులను గుర్తించి సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. కళాశాల సాధించిన ప్రగతిని ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె సత్కరించారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కోటాన రాము, ఉప ప్రిన్సిపల్ బి.శంకర్ పాల్గొన్నారు.

■ 30న రైఫిల్, వుషు పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్, వుషు పోటీలు, ఎంపికలు పరవాడ మండలం పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ మైదానంలో ఈనెల 30న ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు వి.దేవుడు, ఎం.వి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. అండర్-14, 17 బాలబాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలు, ఎంపికలు జరుగుతాయన్నారు.

■ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో చోరీ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలోని ఓ ఇంట్లో శనివారం చోరీ జరిగింది. సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలోని బ్లాక్‌నెంబరు 36లోని పైఅంతస్తులో గంపరాయి భాగ్యలక్ష్మి గత కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. ఈమె ఉదయం ఇంటి తలుపులు వేసుకుని స్థానిక రెస్టారెంట్‌లో పనిచేయడానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపుల తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలకి వెళ్లి చూడగా బీరువాలోని ముప్పావుతులం బంగారం చెవిలీలు, 9 తులాల వెండిపట్టీలు, రూ.50వేలు నగదు కనబడకపోవడంతో దొంగతనం జరిగిందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

■ భగత్‌సింగ్‌కు ఘన నివాళి

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: భారత స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్‌సింగ్ జయంతిని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) శనివారం ఘనంగా నిర్వహించింది. సుజాతనగర్ దరి భగత్‌సింగ్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి విప్లవ నివాళి అర్పించారు. కార్యక్రమంలో పెందుర్తి సమాఖ్య శాఖ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, పవన్, స్థానిక యువత పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

ఒక రోజు వర్షం.. వారమంతా అవస్థలు





చాణక్యనగర్ రామాలయం వద్ద..

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయకపోతే వాటివల్ల కలిగే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లన్నీ దెబ్బతినడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. గతంలో ఆయా ప్రాంతాల్లో జరిగిన యూజీడీ పనుల కారణంగా ఎక్కడికక్కడ రోడ్లు తవ్వేశారు. గతంలో ఉన్న బీటీ, సీసీ రహదారులను తవ్వేసి రోడ్డు మధ్యలో గొట్టాలను అమర్చారు. ఆ గోతులను తిరిగి పూడ్చడంలో నాణ్యత పాటించకపోవడంతో గోతులున్న చోట మట్టి కుంగిపోయింది. పలు చోట్ల రోడ్డు మధ్యలో భారీ గుంతలు ఏర్పడి ప్రయాణం నరకంగా మారిందని పలు కాలనీల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

ఏ కాలనీ చూసినా అదే దుస్థితి..

ఒకరోజు వర్షం కురిస్తే వారం రోజుల పాటు అవస్థలు పడే పరిస్థితి వస్తోందని కాలనీల్లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 97వ వార్డు పరిధిలోని డబ్ల్యూటీటీ కాలనీలో నాలుగు రోడ్ల కూడలిలో భారీ గుంత ఏర్పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అది చెరువును తలపిస్తోంది. నిత్యం ఈ బురదలో నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. చాణక్యనగర్‌లోని రామాలయం ఎదురుగా కూడలిలో రెండు భారీ గుంతలు ప్రజలను భయపెడుతున్నాయి. రాత్రివేళ ఈ దారిలో టిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించాల్సి వస్తోందని ద్విచక్ర వాహన చోదకులు చెబుతున్నారు. చినముషిడివాడ శాంతినగరం నుంచి రైతుబజార్ వైపు వెళ్లే మార్గం దయనీయంగా మారింది. దారంతా కంకరతేలి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇరుకైన ఈ దారిలో గుంతల్లో వర్షం నీరు నిలిచి పాదచారులు సైతం రాకపోకలు సాగించలేని దుస్థితి ఏర్పడుతోందని అక్కడి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శాంతినగరంలో రహదారి దుస్థితి..

దారులు బాగు చేయాలని వినతి

కాలనీల్లో ధ్వంసమైన రహదారులను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కొత్త రోడ్ల నిర్మాణానికి సమయం పట్టే పరిస్థితి ఉంటే కనీసం మరమ్మతులైనా చేయాలని విన్నవిస్తున్నారు. ఇటీవల ప్రధాన రహదారుల్లో గుంతలను పూడుస్తున్న నేపథ్యంలో అదే తరహాలో కాలనీల్లోని గుంతలను కూడా పూడ్చాలని కోరుతున్నారు. ఏళ్లుగా పరిస్థితి ఇలాగే ఉన్నా రహదారుల నిర్మాణానికి నోచుకోవడం లేదని వాపోయారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సబ్బవరం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో అండర్-19 విభాగంలో చదరంగం, క్యారమ్స్, మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఇక్కడ గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు గురుకులం ప్రిన్సిపల్ ఎన్.రామకృష్ణ, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి తెలిపారు. పీడీలు సుధాకర్, సీఎల్ఎన్ ప్రసాద్, సూర్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు. క్యారమ్స్ బాలుర విభాగంలో కె.ఆచారావు, జి.కమలాకర్, ఎం.రాజ్‌కుమార్, సీహెచ్ జాన్, ఎ.హరీష్, బాలికల విభాగంలో వై.భవాని, ఎస్.ప్రియదర్శిని, ఈ.సౌజన్య, ధాతిక, చదరంగం బాలుర విభాగంలో టి.మణిచందన్, జి.సాకేత్, వై.హరి, డి.చరణ్ తేజ, ఎస్.రఘు, బాలికల విభాగంలో ఎ.అలేఖ్య, పి.చైతన్యదీప్తి, ఎస్.పూజిత, కె.యశస్విని, కె.జ్యోతి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

వైద్య కాంట్రాక్టు కార్మికుల సమ్మె వాయిదా



కార్మిక సంఘం నాయకులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ శంకర్ ప్రసాద్

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలోని నాలుగు సామాజిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఈ నెల 30వ తేదీ నుంచి పిలుపునిచ్చిన సమ్మెను వాయిదా వేసినట్లు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. సమ్మె నేపథ్యంలో శనివారం పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో డీసీహెచ్‌ఎస్ సీహెచ్.శంకర్‌ప్రసాద్‌ను కలిశారు. సమస్యల పరిష్కారానికి అక్టోబరు 5వ తేదీ వరకు డీసీహెచ్‌ఎస్ గడువు కోరిన నేపథ్యంలో సమ్మె వాయిదా నిర్ణయం తీసుకున్నట్లు లక్ష్మణ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 5వ తేదీ నాటికి శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్‌కంట్రోల్, సూపర్‌వైజర్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే 6వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద, భవాని, కుమారి, రామలక్ష్మి, ఉమాదేవి, బి.లక్ష్మి, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ


సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఇరువాడ పంచాయతీలోని కృపా సహకార కేంద్రంలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్టు ఛైర్మన్ పువ్వల విజయ్‌కుమార్ శనివారం 30 మంది నిరుపేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాస్టర్ శ్యాంబాబు, మణమ్మ హాజరయ్యారు. ప్రతినెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఛైర్మన్ పువ్వల విజయ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో బ్రదర్ ఇస్సాక్, మ్యాథ్యూ, స్మైలీ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ ఒప్పందంతో కార్మికులకు మేలు

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: దేశంలో ప్రధాన ఓడరేవులలో పనిచేస్తున్న పోర్టు, డాక్ కార్మికుల వేతన సవరణపై ముంబయిలో కేంద్ర నౌకాయాన, జల రవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్, ఆ శాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో విశాఖ పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.కె.శర్మ పాల్గొన్నట్లు యూనియన్ కోశాధికారి కోన మంగయ్యానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కార్మికులకు సంబంధించిన ఇన్సెంటివ్స్, పెన్షన్ తదితర అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఈ ఒప్పందం కారణంగా కార్మికులకు మేలు కలుగుతుందన్నారు. 2022 జనవరి 1 నుంచి ఏరియర్స్ కూడా లభిస్తాయని వివరించారు. వేతన పెరుగుదల విషయంలో ఫెడరేషన్ కృషి వల్ల ఈ ఒప్పందం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు.

పీలా గోవింద్‌కు అభినందనల వెల్లువ

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బలగ చిన్నారావు, సహాయ కార్యదర్శి పెంటకోట శ్రీనివాసరావు శనివారం పీలా నివాసంలో ఆయన్ను కలిసి పూలమాల వేసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.



పీలా గోవింద్‌ను సత్కరిస్తున్న దస్తావేజు లేఖరుల సంఘం ప్రతినిధులు చిన్నారావు, శ్రీనివాసరావు

స్వర్ణాంధ్ర పోటీలకు స్పందన

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కె.విరాజిత(చింతలగ్రహారం), ఎ.ధన్వంత్ బాబు(పెందుర్తి), జి.సౌజన్య (నరవ) పాఠశాలల విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో పి.అచ్యుతరావు(నరవ బీసీ గురుకులం), ఎలిసా(శాంతినగరం) ఖతిజ(వేపగుంట బాపూ పాఠశాల) విజేతలుగా నిలిచారు. వీరంతా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయిని సీహెచ్.చిన్నమ్మాయి తెలిపారు. పోటీలను ఎంఈవో-1, 2 డి.త్రినాథరావు, టి.మధుమూర్తి పర్యవేక్షించారు. రిసోర్స్ పర్సన్ సింగంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తి పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

అనారోగ్య బాలుడికి ఆర్థిక సాయం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ అనారోగ్య బాధిత బాలుడికి శనివారం ఆర్థిక సాయం అందించింది. భీమిలి నియోజకవర్గం శొంఠ్యాం మండలానికి చెందిన నాగసాయి ఈశ్వర్ రెడ్డి(8) మానసిక దివ్యాంగుడు. ఇతడికి సదరం ధ్రువీకరణ కోసం కేజీహెచ్‌లో వైద్య పరీక్షలకు అవకాశం లేకపోవడంతో ప్రయివేటు ఆసుపత్రికి సిఫార్సు చేశారు. కూలీ పనుల చేసుకునే బాలుడి తండ్రి సత్యప్రసాద్ రెడ్డి వైద్య పరీక్షకు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ముందకొచ్చింది. ఆ మేరకు రూ.10వేలు చెక్కును ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను, సిరిమళ్ల గణేశ్ బాలుడి తండ్రికి అందజేశారు

చెట్ల కొమ్మలు తొలగింపు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే

నాయుడుతోట దరి నర్సింగబిల్లమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో విద్యుత్తు స్తంభాలను చుట్టేసి ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను ఆ శాఖ సిబ్బంది శనివారం తొలగించారు. 'చెట్ల కొమ్మల్లో విద్యుత్తు స్తంభాలు' శీర్షికతో ఈనెల 27న శుక్రవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈపీడీసీఎల్ ఏఈ సీహెచ్ రమణ స్పందించి సిబ్బందితో చెట్ల కొమ్మలను పూర్తిగా తొలగించేలా చేశారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.



ఈనాడు కథనానికి స్పందన

పైడమ్మబంద గండి పూడ్చివేత

పరవాడ, న్యూస్‌టుడే

మేజర్ పంచాయతీ పరవాడలోని పైడమ్మబంద చెరువుకు పడిన గండిని అధికారులు పూడ్చివేశారు. ఈనెల 24న మంగళవారం రాత్రి కురిసన భారీ వర్షానికి వరద పెద్దఎత్తున చేరడంతో పైడమ్మబంద గట్టు కోతకు గురై గండి పడింది. దీంతో రైతుల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సమస్యపై ఈనెల 25న 'పెడిమ్మబందకు గండి' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురించిన వార్తకు సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. లారీలపై మట్టిని తీసుకొచ్చి గండిని పూడ్చారు.



శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్



ట్రాన్స్‌కో డిపో ముందు ధర్నా చేస్తున్న ఒప్పంద కార్మికులు

వేపగుంట, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఏపీట్రాన్స్‌కో జిల్లా స్టోర్స్ డిపో ముందు శనివారం ధర్నా చేశారు. గోపాలపట్నం డివిజన్ సిటూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముద్దాడ ప్రసాదరావు పాల్గొని ప్రసంగించారు. ఈనెల 30న నగరంలో మహాధర్నా చేపట్టనున్నామన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఏపీట్రాన్స్‌కో స్టోర్స్ హమాలీలు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కార్మికుల ఆందోళన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ప్లాంటు ప్రధాన గేటు ఎదురుగా ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడారు. కార్మికులకు ఎన్టీపీసీ లోగోతో కూడిన గుర్తింపు కార్డులను ఇవ్వాలని, ఈఎస్ఐ, పి.ఎఫ్, బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య పరీక్షల పేరుతో కార్మికుల అక్రమ తొలగింపును నిలుపుదల చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, గోవిందరాజ్, నాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీపీసీ ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, సీఐటీయూ ప్రతినిధులు



రమణికి చెక్కు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల దాతృత్వం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో కలసి పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వీరిలో ఒకరైన బండారు రమణ అనారోగ్య కారణంతో ఈనెల 16న మృతి చెందారు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె ట్రిపుల్ ఐటీ, కుమారుడు 9వ తరగతి చదువుతున్నారు. ఇంటి పెద్ద దిక్కు చనిపోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఆ విషయాన్ని గమనించిన రమణ స్నేహితులైన పూర్వ విద్యార్థులు అంతా కలసి తలా కొంత మొత్తాన్ని సేకరించి రూ.42,500 శనివారం రమణ భార్య రమణికి అందించారు.

ఆస్తి పన్ను చెల్లించి సహకరించండి

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-8 పరిధిలోని నివాసితులు అర్ధ సంవత్సరం పన్నులను ఈనెల 30లోగా చెల్లించి అభివృద్ధికి సహకరించాలని జోనల్ కమిషనరు హేమవతి కోరారు. ఈనెల 29న ఆదివారం శెలవు దినం అయినప్పటికీ పన్నులు చెల్లించేందుకు సౌకర్యం కేంద్రం తెరిచే ఉంచుతామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

భారీ గుంతలు.. వాహనాల మొరాయింపు

పరవాడ, న్యూస్‌టుడే: గాజువాక - ఎలమంచిలి ప్రధాన రహదారిలోని పరవాడ పైడిమాంబ ఆలయ సమీపంలో రాకాసి గుంతలు కారణంగా శనివారం పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో చోదకులు, ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు ఇక్కడ రహదారి ధ్వంసమై గుంతలు పడి రాళ్లుదేలడంతో రాకపోకలకు వీలులేకుండా పోతోంది. ఈ దారి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, అచ్యుతాపురం ఎస్ఈజెడ్, గాజువాక, ఎలమంచిలి వెళ్లే భారీ వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ మరింత ఎక్కువగా నిలిచిపోతుందని పరిసర గ్రామాల ప్రజలు చెబుతున్నారు. లంకెలపాలెం నుంచి పరవాడ ప్రధాన మార్గంలోనూ ఇదే దుస్థితి. పరిమితికి మించి లోడుతో వెళ్లడంతో లారీలు మొరాయించి నిలిచిపోతున్నాయి. రాత్రి సమయంలో చీకటి కారణంగా మిగతా వాహనదారులకు దగ్గరికి వచ్చేవరకు ఈ వాహనాలు కనబడకపోవడంతో వాటిని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. మొరాయించిన లారీల వద్ద ఎటువంటి భద్రత చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



గాజువాక - ఎలమంచిలి రహదారిలో కిలోమీటరు మేర నిలిచిపోయిన భారీ వాహనాలు



పరవాడ సంపద తయారీ కేంద్రం వద్ద మొరాయించిన లారీ


బిల్లుల చెల్లింపుపై క్షేత్ర స్థాయి సర్వే

పరవాడ, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ పరవాడలో 2014 నుంచి 2019 మధ్యకాలంలో తెదేపా హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారుల వివరాల సేకరణ నిమిత్తం శనివారం గృహ నిర్మాణ అధికారులు, సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయి సర్వే చేపట్టారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొంతమంది బిల్లుల చెల్లింపు నిలిపివేసింది. దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ పైలా రమణబాబు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, సచివాలయ సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ తిరిగి వివరాలు నమోదు చేస్తున్నారు.



సర్వేలో పాల్గొన్న సచివాలయ, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది

వార్డులు మారి నాలుగేళ్లు.. పేర్లు మాత్రం అలానే..



కేఎన్‌పాలెం సచివాలయంపై 55వ వార్డు అని రాసి ఉన్న దృశ్యం

పరవాడ, న్యూస్‌టుడే

జీవీఎంసీలో నాలుగేళ్ల క్రితం చేపట్టిన వార్డుల పునర్విభజనలో భాగంగా పలు ప్రాంతాలు ఇతర వార్డుల్లోకి మారాయి. ప్రస్తుత 77వ వార్డు గతంలో 55వ వార్డుగా ఉండేది. అయితే వార్డులోని కె.ఎన్.పాలెం, పెదపాలెం, గొల్లపేట, నమ్మిదొడ్డి కూడలిలో ఉన్న మొత్తం నాలుగు సచివాలయం భవనాలపైన ఇప్పటికీ 55వ వార్డు అని రాసిన పేర్లే దర్శనమిస్తున్నాయి. 77వ వార్డుగా మారి నాలుగేళ్లు అవుతున్నా ఇప్పటికీ భవనాల గోడలపై 55వ వార్డు అని రాసి ఉండడంతో అధికారుల తీరుపట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారంతా 55వ వార్డు అని రాసి ఉండడంతో అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా పేర్లు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



పెదపాలెంలో..

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్



✦ గోవాలో ఏటా నిర్వహించే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) 55, 56వ ఎడిషన్లకు డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
జ: ప్రముఖ భారత దర్శకుడు శేఖర్ కపూర్

✦ 2024–2025 సంవత్సరానికి 'ఆసియా డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ సెంటర్ (ఏడీపీసీ) అధ్యక్ష బాధ్యతలను ఇటీవల ఏ దేశం చేపట్టింది?
జ: భారత్

మాదిరి ప్రశ్నలు

(ఎన్‌డీఎంఏ సభ్యుడు, విభాగాధిపతి రాజేంద్రసింగ్ 2024, జులై 25న ఏడీపీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు)

✦ దేశంలోనే తొలిసారిగా ఏ ఓడరేవులో సమగ్ర వ్యవసాయ ఎగుమతి సౌకర్యాన్ని (ఇంటిగ్రేటెడ్ అగ్రి ఎక్స్‌పోర్ట్ ఫెసిలిటీ) అభివృద్ధి చేస్తున్నారు? (ఈ ప్రాజెక్టు విలువ రూ.284.19 కోట్లు. విస్తీర్ణం 67,422 చదరపు మీటర్లు. ఈ ఓడరేవు ఇప్పటికే దేశంలో మొదటి 100 శాతం ల్యాండ్ లార్డ్ పోర్టుగా గుర్తింపు పొందింది.)
జ: జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు, ముంబయి

✦ 'వరల్డ్ హెపటైటిస్ డే'ను ఏటా ఏ రోజు నిర్వహిస్తారు? ('ఇట్స్ టైం ఫర్ యాక్షన్' అనేది ఈ ఏడాది థీమ్.)
జ: జులై 28

✦ దేశంలో 500వ కమ్యూనిటీ రేడియో స్టేషన్ 'అప్నా రేడియో 90.0 FM'ను ఇటీవల ఎక్కడ ప్రారంభించారు?
జ: ఐజ్వాల్

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

అన్ని సబ్జెక్టులను చదవడానికి, రివిజన్‌కు వీలు కల్పించే విధంగా స్టడీప్లాన్ సిద్ధం చేసుకోవాలి. సబ్జెక్టుల వారీగా అభ్యర్థుల బలాలు, బలహీనతల ఆధారంగా ఆ ప్రణాళిక ఉండేలా చూసుకోవాలి.

డీఎస్సీ/ టెట్ - 2024
తెలుగు కంటెంట్

పద్యతరగతి



తెలుగు
ప్రత్యక్ష దైవాలు

తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు!

ప్రశ్నలు జవాబులు

1) 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి గురించి రాయండి. **(4 మా.)**

జ: 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి ఎఱ్ఱన.

కాలం: క్రీ.శ.14వ శతాబ్దం. **తల్లిదండ్రులు:** పోతమ్మ, సూరనలు. **జననం:** పాకనాడు సీమ (నెల్లూరు జిల్లా కందుకూరు సమీపంలోని గుడ్లూరు గ్రామం). **ఉద్యోగం:** అద్దంకిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. **రచనలు:** రామాయణం, హరివంశం, అరణ్యపర్వశేషం, నృసింహపురాణం **బిరుదులు:** శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు. **రచనా శైలి:** సూక్తి వైచిత్రితో పేరెన్నిక గన్నది. ◆ ప్రస్తుత పాఠ్యాంశాన్ని మహాభారతంలోని అరణ్యపర్వంలోని 5వ ఆశ్వాసం నుంచి గ్రహించారు.

2) వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్న నేటి రోజుల్లో 'తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు' అనే ధర్మవ్యాధుడి అభిప్రాయ ప్రాధాన్యతను పాఠం ఆధారంగా వివరించండి. **(8 మా.)**

జ: తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదని మన పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ✦ తల్లిదండ్రులే పిల్లలకు ప్రత్యక్ష దైవాలు. ✦ వారిని కష్టపెట్టకూడదు. ✦ కేవలం అమ్మానాన్నలను పూజించడం తప్ప వేరే దైవాన్ని కూడా పూజించని ధర్మవ్యాధుడు ధర్మాత్ముడు అయ్యాడు. ✦ వేదాలు, శాస్త్రాలు చదివిన కౌశికుడి లాంటి వ్యక్తికి కూడా ధర్మసూక్ష్మాలు తెలిపాడు. ✦ మనకు శరీరాన్నిచ్చి, పెంచి, పోషించి ఒకస్థాయికి తీసుకుని వచ్చిన తల్లిదండ్రులను మించిన దైవం లేదని ధర్మవ్యాధుడు తన మాటలు, ఆచరణ ద్వారా నిరూపించాడు. ✦ తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఎంత జ్ఞానం సంపాదించినా, పుణ్య కార్యాలు చేసినా ప్రయోజనం లేదు. ✦ యజ్ఞాలు, వ్రతాలు, పూజలు అన్నీ చేసిన ఫలితం తల్లిదండ్రుల సేవ వల్ల లభిస్తుంది. ✦ ఇంట్లో కన్నవారి రూపంలో ఉన్న ప్రత్యక్ష దైవాలను వదిలి జ్ఞానం, పుణ్యం కోసం ఎక్కడెక్కడికో వెళ్లడం వెర్రితనం.

ముఖ్యమైనవి మరికొన్ని..

8 మార్కుల ప్రశ్నలు

1) ప్రత్యక్ష దైవాలు పాఠం సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

2) ఈ పాఠం ఆధారంగా ధర్మవ్యాధుడి వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

జవాబుల కోసం

– చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

మనుగడకు మూలాలు.. ప్రగతి సాధనాలు!

ఇండియన్ జాగ్రఫీ

ఆధునిక ప్రపంచం మనుగడ అంతా శక్తివనరులపైనే ఆధారపడి నడుస్తోంది. విద్యుత్తు తయారీకి, వాహనాలు నడిచేందుకు, వివిధ ఉత్పత్తులకు శిలాజ ఇంధనాలే ప్రధాన ఆధారాలు. ఆర్థిక, అభివృద్ధి కార్యకలాపాల్లో వాటిని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, అణుశక్తికి సంబంధించిన ప్రాథమికాంశాలను పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశంలో వాటి లభ్యత, విస్తరణ, ఉత్పత్తి తీరుతెన్నులు, ఆ కార్యకలాపాల్లో నిమగ్నమైన భారత ప్రభుత్వ సంస్థల గురించి అవగాహన కలిగి ఉండాలి.

శక్తివనరులు

ఆధునిక యుగంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రధాన కారకం శక్తివనరు. ఏదైనా ఒక దేశం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఇది చాలా అవసరం. ఒక ప్రదేశ ఆర్థిక అభివృద్ధి, అక్కడి శక్తిసంపద, దాన్ని వినియోగిస్తున్న విధానంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం శక్తివనరులను ప్రాథమిక స్థాయి నుంచి అంటే ఆహార పదార్థాలను వండుకోవడం నుంచి ఆధునిక స్థాయి అంటే పరిశ్రమలు, వ్యాపారం, రవాణా, సమాచార అభివృద్ధి వరకు బహుళ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు. మూలాధారం, వినియోగం ఆధారంగా శక్తివనరులను రెండు రకాలుగా పేర్కొనవచ్చు. అవి 1) వాణిజ్యేతర శక్తి 2) వాణిజ్య శక్తి. అటవీ ఉత్పత్తులు, కర్రబొగ్గు, ఆవు పేడ, వ్యవసాయ వ్యర్థాలు, పశువుల శక్తి మొదలైనవి వాణిజ్యేతర శక్తి వనరులు. నేలబొగ్గు, సహజవాయువు, జలవిద్యుత్తు, చమురు (క్రూడ్ ఆయిల్), పవనశక్తి, సౌరశక్తి, అణుశక్తి మొదలైనవి వాణిజ్య శక్తికి ఉదాహరణలు. మరోవిధంగా శక్తివనరులు రెండు రకాలు అవి-

1) తరిగిపోయేవి: వాడిన కొద్దీ నిల్వలు తగ్గిపోతూ ఉంటాయి. పునరుత్పత్తి చేయడం కుదరదు. వీటినే సంప్రదాయ ఇంధన వనరులు అంటారు. అవి- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తి, యురేనియం, థోరియం.

2) తరగనివి: ఎంత వాడినా, ఎన్నిసార్లు వాడినా తరిగిపోవు. మళ్లీ మళ్లీ ఉపయోగించవచ్చు. వీటినే సంప్రదాయేతర ఇంధన వనరులు అంటారు. అవి నీరు, గాలి, సూర్యరశ్మి మొదలైనవి.

దేశంలో వాణిజ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు, ముడిచమురు, అణుశక్తి, సహజవాయువు, జలవిద్యుత్తును వినియోగిస్తున్నారు. నేడు సౌరశక్తి, పవనశక్తి, సముద్ర తరంగాల శక్తి, జీవశక్తి (బయోఎనర్జీ) ఉత్పత్తి, వాడకమూ పెరిగింది.

> **దేశంలో బొగ్గు ఉత్పత్తిలో ముందంజలో ఉన్న రాష్ట్రాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్. ప్రస్తుతం 90% బొగ్గు ఉత్పత్తి ఉపరితల గనుల ద్వారా జరుగుతోంది. భారత్ బొగ్గును నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్‌కు ఎగుమతి చేస్తూ; ఇండొనేసియా, దక్షిణాఫ్రికాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.**



రావత్‌భటాలోని రాజస్థాన్ అటామిక్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్‌ఏపీపీ)

సంప్రదాయ ఇంధన వనరులు

బొగ్గు: ఇంధన వనరుల్లో ప్రధానమైంది. దేశంలో జరిగే విద్యుత్తు ఉత్పత్తిలో 50% పైగా బొగ్గు ద్వారానే జరుగుతోంది. ప్రపంచంలో అధిక బొగ్గు నిల్వలున్న దేశాల్లో భారత్ 5వ స్థానంలో (2023-24 - 378.21 బి.టన్నులు) ఉంది. (మొదటి నాలుగు స్థానాల్లో అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, చైనా ఉన్నాయి.) ప్రపంచంలో బొగ్గు ఉత్పత్తి దేశాల్లో భారత్‌ది రెండో స్థానం (2023-24- 997.25 మిలియన్ టన్నులు). (మొదటి స్థానంలో చైనా, మూడో స్థానంలో ఇండొనేసియా ఉన్నాయి.) బొగ్గును 'నల్లబంగారం' అంటారు. దేశంలో బొగ్గు నిక్షేపాలు రెండు రకాలు.

గోండ్వానా రకం నిక్షేపాలు: ఇవి కార్బొనిఫెరస్ యుగంలో ఏర్పడ్డాయి. మహానది, సోన్, నర్మద, దామోదర్ నదీ లోయ ప్రాంతాల్లో; తెలంగాణ, ఏపీలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నాయి. దేశంలోని మొత్తం బొగ్గులో 98% ఈ రకమే. నాణ్యమైన ఆంథ్రసైట్, బిట్యుమినస్ రకానికి చెందింది.

టెర్షియరీ రకం: ఇది లిగ్నైట్ రకానికి చెందింది. అస్సాం, శివాలిక్ కొండల వద్ద రాజస్థాన్, కశ్మీర్‌లో; తమిళనాడులోని కడలూర్ జిల్లా నైవేలి, గుజరాత్‌లోని కచ్ ప్రాంతాల్లో లభిస్తుంది. దేశం బొగ్గు నిల్వల్లో ఈ రకం 2% మాత్రమే.

బొగ్గు రకాలు: బొగ్గు ఏర్పడే క్రమంలో ఒత్తిడి, ఉష్ణోగ్రత, కాలం ఆధారంగా పలు రకాలుగా ఏర్పడతాయి. బొగ్గులో మందం, గట్టిదనం, తేమశాతం, బూడిద రకం వేరుగా ఉంటాయి.

ఆంథ్రసైట్: ఇది నాణ్యమైంది, దృఢమైంది. నలుపు రంగులో ఉంటుంది. ఇందులో 80% పైగా కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో లభిస్తుంది. మండేటప్పుడు నీలి రంగులో ఉంటుంది.

బిట్యుమినస్ రకం: మెత్తగా ఉంటుంది. దేశంలో అత్యధికంగా ఉన్నది ఇదే. దీనిలో కర్బనం 40-80%, తేమ 15-40% ఉంటుంది. ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌ల్లో లభిస్తుంది.

లిగ్నైట్: దీన్ని గోధుమ రంగు బొగ్గు అంటారు. 40%-50% కర్బనం, 35% తేమ ఉంటుంది. నైవేలి (తమిళనాడు), పల్నా (రాజస్థాన్), లక్ష్మీపుర్ (అస్సాం), కారేవా (జమ్ము-కశ్మీర్)ల్లో లభిస్తుంది. తమిళనాడులో లిగ్నైట్ నిక్షేపాలు అధికం.

పిట్: దీనిలో 40-50% కర్బనం ఉంటుంది. బొగ్గు తయారయ్యే క్రమంలో ఏర్పడుతుంది. దీన్ని కాల్చినప్పుడు పొగ, బూడిద ఎక్కువగా వస్తాయి.

> **దేశంలో 1774లో అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ అనుమతితో మొదటిసారిగా పశ్చిమ బెంగాల్‌లోని 'రాణిగంజ్' వద్ద బొగ్గు గనుల తవ్వకం ప్రారంభమైంది.**
>
> **ప్రపంచ థర్మల్ విద్యుత్తు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి రెండు స్థానాల్లో చైనా, అమెరికా ఉన్నాయి.**

ముడిచమురు: పెట్రోలియం అంటే శిలాజ ఇంధనం. దీని నుంచే పెట్రోలు, డీజిల్, కిరోసిన్ లభిస్తాయి. దేశంలో మొదట అస్సాంలోని మాకూమ్ (1867)లో ముడిచమురు గుర్తించగా, అస్సాంలోని డిగ్బాయ్ (1889)లో తొలుత చమురు వెలికితీశారు. సహర్ కటియ, కాంబట్ సింధుశాఖ, బాంబే హై వద్ద పెట్రోలియం నిల్వలను గుర్తించారు. 1956లో భారత్‌లో ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) ఏర్పడింది. నాటి నుంచి దీని పర్యవేక్షణలో చమురు నిల్వల అన్వేషణ, వెలికితీత జరుగుతోంది. 2024, సెప్టెంబరు 19 నాటికి భారత్‌లో గుర్తించిన చమురు నిల్వల అంచనా 410.5 మిలియన్ మెట్రిక్ టన్నులు. 2023-24 నాటికి వెలికితీసిన ముడిచమురు 29.4 మిలియన్ మెట్రిక్ టన్నులు.

> **ఒక బారెల్ ముడిచమురు నుంచి 42% పెట్రోలు, 22% డీజిల్, 9% జెట్ ఇంధనం, 5% కిరోసిన్, 4% ఎల్‌పీజీ, 18% ఇతర పదార్థాలు వస్తాయి.**
>
> **ప్రపంచ పెట్రోలు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో అమెరికా, రెండో స్థానంలో చైనా ఉన్నాయి.**

సహజ వాయువు: భారత్‌లో సహజవాయువు పరిశ్రమ 1960ల్లో అస్సాంలోని డిగ్బాయ్, మహారాష్ట్రలోని ముంబయి హై ఫీల్డ్‌లో ప్రారంభమైంది. 2020-21 లెక్కల ప్రకారం దేశంలో మొత్తం సహజవాయువు నిల్వలు 1,372.62 బి.క్యూబిక్ మీటర్లు. మొత్తం నిక్షేపాల్లో సముద్ర తీరప్రాంతాల్లో ఎక్కువగా ఉండగా, పశ్చిమ తీరంలో 23.7%, తూర్పు తీరప్రాంతాల్లో 41%గా ఉంది. దేశంలో ఉత్పత్తి అయ్యేమొత్తం సహజవాయువులో 75% ఓఎన్‌జీసీ ఉత్పత్తి చేస్తుంది.

అణుశక్తి: అణుశక్తికి కావాల్సినవి యురేనియం, థోరియం నిల్వలు. దేశంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాల తీరప్రాంతంలో ఇల్మినైట్, మోనోజైట్ ఖనిజాలు లభిస్తాయి. ఇల్మినైట్ నుంచి టిటానియం, మోనోజైట్ నుంచి థోరియం వస్తాయి. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను 1967లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో 6,780 మెగావాట్ల సామర్థ్యంతో 7 వేర్వేరు కేంద్రాల్లో మొత్తం 24 అణువిద్యుత్తు రియాక్టర్లు పనిచేస్తున్నాయి. 1972లో రాజస్థాన్‌లోని కోటా సమీపంలో రెండో అణువిద్యుత్తు కేంద్రాన్ని రావత్‌భటాలో స్థాపించారు.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్



కోర్సు మీరు పెట్టండి.. నిధులు మేమిస్తాం..

ఏయూకు 'మైటీ' ప్రతిపాదన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీటెక్ కోర్సుల్లో వెరీ లార్జ్‌స్కేల్ ఇంటిగ్రేషన్ (వి.ఎల్.ఎస్.ఐ.) కోర్సును ఏర్పాటు చేస్తే అందుకు అవసరమైన సంపూర్ణ నిధులు తాము ఇస్తామని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ(మైటీ) ముందుకు వచ్చింది. ఈ మేరకు ఇటీవల ఆంధ్రవిశ్వవిద్యాలయం సందర్శించిన మైటీ కార్యదర్శి ఎస్.కృష్ణ ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుతో ఈ విషయమై చర్చించారు. ఈ కోర్సుకు మంచి డిమాండ్ ఉందని ఆయన పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో ఈ కోర్సు అభ్యసించిన విద్యార్థులకు భారీ వేతనాలతో కూడిన ఉద్యోగాలు ఉంటాయని ఆయన చెప్పినట్లు తెలిసింది.

ఏమిటీ ఈ వి.ఎల్.ఎస్.ఐ.?

వి.ఎల్.ఎస్.ఐ. కోర్సుల్లో సూక్ష్మ చిప్‌ల తయారీ, సెమీ కండక్టర్ల రూపకల్పన, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌ల తయారీ తదితర అంశాలు ఉంటాయి. కృత్రిమ మేధస్సు(ఎ.ఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐ.ఒ.టి) వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో వి.ఎల్.ఎస్.ఐ. కోర్సు చదివిన సాంకేతిక నిపుణులకు అధిక డిమాండ్ ఉంటుంది. ఏయూ ఈ కోర్సు ఏర్పాటు చేసినట్లైతే అడ్వాన్స్‌డ్ లేబొరేటరీ, ఫ్యాకల్టీ, రీసెర్చ్ ప్రాజెక్టులను అందిస్తామని మైటీ తెలిపింది.

అందివచ్చిన అవకాశం..

ఆంధ్ర విశ్వవిద్యాలయం వచ్చే సంవత్సరం నుంచి వి.ఎల్.ఎస్.ఐ. కోర్సును ప్రవేశపెట్టేందుకు ఇప్పటికే నిర్ణయించగా.. అందుకు అవసరమైన నిధుల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కార్యదర్శి ఈ కోర్సు ప్రవేశపెడితే ఆర్థికంగా సహకరిస్తామని చెప్పడం చూస్తే వెతకబోయిన తీగ కాలికితగిలినట్లైంది. దీంతో పాటు పది పోస్టు డాక్టోరల్ ఫెలోలను కూడా అందించడానికి ఆయన సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది.

ఉజ్వల భవిష్యత్తు..

భారత ప్రభుత్వం సుమారు 11 యూఎస్ బిలియన్ డాలర్ల పెట్టుబడితో ధొలేరాలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు భారీగా వి.ఎల్.ఎస్.ఐ. చేసిన డిజైన్ ఇంజినీర్ల అవసరం ఉంది. దిగ్విజయంగా కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు భారీ వేతనాలు అందనున్నాయి.

ఆకట్టుకున్న వైశాఖీ నృత్యోత్సవం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : వైశాఖీ నృత్యోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం పలు ప్రాంతాలకు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా ఒడిశా నాట్యకళాకారిణి ఇలియాన సిటారిస్టికి వైశాఖి జీవన సాఫల్య పురస్కారాన్ని నిర్వాహకులు ప్రదానం చేశారు. ఆమె తన నృత్యంతో ఆహూతులను అలరించారు. విశాఖపట్నంకు చెందిన గీతానారాయణ్ తన నృత్యంతో ఆకట్టుకున్నారు. మరికొంత మంది కళాకారులకు తమ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో బత్తిన విక్రమ్‌కుమార్‌గౌడ్, ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ, ఆదాయపు పన్నులశాఖ విశ్రాంత కమిషనర్ రవిశంకర్‌నారాయణ్, తదితరులు పాల్గొన్నారు.



ఒడిశా కళాకారిణి ఇలియాన సిటారిస్టికి వైశాఖి జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న దృశ్యం



కళాకారుల నృత్య ప్రదర్శన

30లోగా ఆస్తి పన్ను చెల్లించండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహావిశాఖ నగరపాలక సంస్థ పరిధిలోని నివాసితులు మొదటి అర్ధ సంవత్సరం ఆస్తిపన్నును ఈనెల 30లోగా చెల్లించాలని రెవెన్యూ ఉప కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. సెప్టెంబరుతో మొదటి అర్ధ సంవత్సరం పూర్తి కానుండటంతో పన్ను బకాయిలు చెల్లించి జీవీఎంసీకి సహకరించాలని కోరారు.

గస్తీ తక్కువ.. చోరీలెక్కువ

గురుద్వారా, న్యూస్‌టుడే

నగర నడిబొడ్డున ఉన్న ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీల బెడద అధికమైంది. దొంగలు రెచ్చిపోయి ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. ఉదయం వేళల్లో రెక్కీ నిర్వహించి రాత్రుళ్లు విలువైన వస్తువుల్ని మాయం చేస్తున్నారు. ఇంటి ముందు నిలిపిన వాహనాల్లో పెట్రోల్ తీసేయడంతో పాటు నిర్మానుష్య ప్రదేశాల్లోని వాహనాలను ఎత్తుకెళ్లిపోతున్నారు. అంతటితో ఆగకుండా అలికిడి లేని ఇళ్లను ఎంచుకొని మరీ కొల్లగొడుతున్నారు. సీతంపేట, రాజేంద్రనగర్, గాంధీనగర్, సీతమ్మధార ఏఎస్ఆర్ నగర్, టీపీటీ, పీఅండ్‌టీ కాలనీలు, ద్వారకానగర్ ప్రాంతాలు స్టేషన్ పరిధిలోకి వస్తాయి. ఇటీవల గాంధీనగర్, సీతంపేట, పీఅండ్‌టీ కాలనీల్లో వాహనాల్లో పెట్రోలు, చిన్న చిన్న వస్తువులు వంటివి చిల్లర దొంగతనాలు జరుగుతున్నాయి. చిన్నవి కావడంతో బాధితులు కూడా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో అదే అదునుగా చేసుకుని దొంగలు మరింత పెచ్చుమీరిపోతున్నారు. స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉండటం, పైగా అందులోనే బందోబస్తులకు పంపించడంతో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కరవైందని తెలుస్తోంది. దీంతో రాత్రి సమయాల్లో ఉండాల్సిన గస్తీ బీట్లు కంటే తక్కువగా ఉండటంతో పోలీసులకు చిక్కకుండా దొంగలు తమ పనిని సులువుగా చేసుకెళ్లిపోతున్నారు. ఓ చోట పెట్రోల్ తీసేస్తుంటే మరో చోట ఏకంగా వాహనాన్నే ఎత్తుకెళ్లిపోతున్నారు. ఇళ్ల ముందు వాహనాలు పెట్టేందుకు సంకోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఎన్ని జాగ్రత్తలు వహిస్తున్నా దొంగల తీరుతో విసిగిపోతున్నామని వాపోతున్నారు. వీటిని అరికట్టడంలో క్రైం పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. చోరీ జరిగిన తర్వాత వచ్చి పరిశీలిస్తున్నారే తప్ప ముందస్తుగా నివారణ చర్యలపై దృష్టి సారించడం లేదని చెబుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.



మోటారు సైకిల్ అపహరిస్తున్న దొంగ (సీసీ కెమెరాలో నమోదైన చిత్రం)

ఇటీవల జరిగిన చోరీలు

★ వారం రోజుల కిందట గాంధీనగర్ అభయాంజనేయస్వామి ఆలయం సమీపంలో వెంకటరమణ అనే వ్యక్తి ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని రాత్రి సమయంలో దొంగిలించారు. ఆ దృశ్యాలు సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి.

★ సోమవారం మధ్యాహ్నం సీతంపేట రాజేంద్రనగర్‌లో ఖాళీ ప్రదేశంలోని ఓ ఇంట్లో మనుషులు ఉండగానే బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించారు.

★ ఇటీవల కాలంలో సీతంపేటలో ఇంటి ముందు నిలిపిన వాహనాల్లో రోజూ పెట్రోల్ దొంగిలిస్తున్నారు.

★ సత్యం కూడలిలో జాతీయ రహదారి పక్కన ఉండే ఆటోలు చక్రాలు, విడిభాగాలు తరచూ చోరీకి గురవుతున్నాయి. పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో మిన్నకుంటున్నారు.

బాబోయ్... ఇవేం ధరలు

◆ రైతుబజార్లలో నాసిరకంగా ఉల్లి
◆ కొనుగోలుదారుల ఆవేదన

ఈనాడు, విశాఖపట్నం


కూరగాయల ధరలు హడలెత్తిస్తున్నాయి. కొనుగోలు నిమిత్తం రైతుబజార్లకు వెళ్లిన సామాన్య, మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కాయగూరలతో పాటు అల్లం, వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆకుకూరలదీ అదే పరిస్థితి. కొత్తిమీర పెద్ద కట్ట రూ.50కి చేరింది.

★ నగరంలోని రైతుబజార్లలో కూరగాయలు, పండ్లు, దుంపలు, ఆకుకూరలు ఇలా 110 రకాల సరకుల విక్రయాలు సాగుతాయి. కొన్ని రకాలే స్థానికంగా రైతులు పండించినవి. చాలా వరకు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నాయి. ఇటీవలి భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. లభ్యత తగ్గిపోవడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి.

★ ఉల్లి, టమాట, చిక్కుళ్లు, దొండ, బీరకాయల ధరలు వింటే చాలు వణుకుపుడుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే దుంపలు, బీన్స్, క్యాప్సికం, ఆగాకర ధరలు ఎక్కువగానే ఉన్నాయి.

★ ఓ మాదిరి పుదీనా కట్ట రూ.30కి చేరింది. తోటకూర, పాల, చుక్క కూరలు రెండు, మూడు కట్టలు రూ.20కి విక్రయిస్తున్నారు.

★ రైతుబజార్లలో నాణ్యమైన కూరగాయలు లభించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. బెండ, దొండ, చిక్కుడు, బీర రకాలు నాణ్యత బాగోలేదని కొనుగోలుదారులు చెబుతున్నారు. కొన్ని చోట్ల రైతు బజార్లలోధరల కన్నా బయట మార్కెట్లోనే రెండు, మూడు రూపాయలు తక్కువకు నాణ్యమైన రకాలు లభిస్తున్నాయి. కిలో ఉల్లి రైతుబజారులో రూ.54 అయితే కొన్ని చోట్ల నాణ్యమైనవి బయట రూ.51కి అమ్ముతున్నారు. ఇదెక్కడి చిత్రమని కొనుగోలుదారులు మండిపడుతున్నారు.



నగరంలో రైతుబజార్లు : 13
నిత్యం విక్రయాలు(సుమారు) : 5 వేల క్వింటాళ్లు

శనివారం రైతుబజారుల్లో ధరలు ఇలా..

రకం	కేజీ (రూ.)
టమాట	44
వంకాయలు	50
కాకరకాయలు	44
ఆగాకర	80
బీరకాయలు	40
దొండకాయలు	40
బరబాటి	48
బీన్స్	68
ఉల్లికాడలు	90
ఉల్లి	54
అల్లం	85
వెల్లుల్లి	280
కంద	64
పచ్చి బఠాని	110
పండు మిర్చి	100
నిమ్మకాయలు	100
క్యాప్సికం	52

జూద శిబిరంపై దాడి

కూర్మన్నపాలెం(రాజీవ్‌నగర్), న్యూస్‌టుడే : జూద శిబిరంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివి. రాజీవ్‌నగర్‌లో నిర్మాణ దశలో ఉన్న బహుళ అంతస్తు భవనంలో కొందరు జూదం ఆడుతున్నట్టు సమాచారం అందడంతో శనివారం సాయంత్రం సిబ్బంది దాడి చేశారు. పట్టుబడ్డ వారిలో వైకాపా నాయకులు, వారు అనుచరులు ఉన్నారు. నిందితుల నుంచి రూ.1.04 లక్షలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్, దువ్వాడ స్టేషన్ ఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌తో గృహనిర్మాణ శాఖ పీడీ భేటీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా గృహనిర్మాణ శాఖపథక సంచాలకుడి(పీడీ)గా బాధ్యతలు చేపట్టిన ఆళ్ల శ్రీనివాస్ శనివారం ఉదయం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా గృహనిర్మాణ పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ పీడీని ఆదేశించారు.



కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు మొక్క అందజేస్తున్న గృహనిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాస్

అప్పన్న ఆలయంలో ఏకాదశి వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం సింహాద్రినాథుడి తిరువీధి ఉత్సవం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన మదనగోపాలస్వామిని శోభాయమానంగా అలంకరించి పల్లకీలో అధిష్ఠింపజేశారు. పండితులు వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తులను సింహగిరి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు గోవింద నామస్మరణతో స్వామిని సేవించారు.



పల్లకిలో కొలువుదీరిన మదనగోపాలస్వామి, అమ్మవార్లు



సింహగిరి మాడవీధుల్లో స్వామి, అమ్మవార్ల తిరువీధి

గరుడ వాహనంపై గోవిందుడికి సేవలు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో ఆర్జిత సేవల్లో భాగంగా శనివారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీదళాలతో అష్టోత్తర శత నామార్చన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవిందుడికి ప్రదక్షిణలు చేసి మొక్కు తీర్చుకున్నారు.



స్వామికి గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

EENADU Classifieds

AGRI BUSINESS

ప్రముఖ కంపెనీకి పెండెన్ శ్రీగంధం, ఎర్రచందనం, మహాగని, టేకు, కొబ్బరి, జామ, సీతాఫలం లభించును. 2 సం॥ సర్వీస్ & లోకేషన్ ఉంది. ✆ 81850 37777.

AUTO

VEHICLES FOR SALE

Car for sale. XUV 500 Silver Colour 2014 Good Condition, New Tyres. Final Price: 4L. Contact: 9951166745, 8905890542.

Creta 2016 Model Excellent Single Hand Maintenance Vehicle Fancy Number. Contact: 7013989329.

Audi Car for Sale
2017 Model, Fancy Number 9, "Audi Q3 Diesel / Red Pearl Colour / Through Bank e-Auction
Price : Rs.13,50,000/-
83309 52080 77028 77188

2000 కిమీ సెల్టోస్ నవంబర్ 2022 మోడల్ రాయల్ ఎన్ఫీల్డ్ మెటియోర్ స్టెల్లార్ రెడ్ కలర్ బైక్ అమ్మకానికి అందుబాటులో ఉంది. Ph: 7075999836.

AUTO FINANCE

2012 ఆ పైన JCBలు, టిప్పర్లు, లారీలు, కార్లకు ఫైనాన్స్ చేయబడును. తక్కువ వడ్డీ రేటు, ఎక్కువ ఫైనాన్స్ ఇవ్వబడును. సెల్: 7661913805.

DRIVING SCHOOLS

Leo Lady Driving School. How to Learn 2 & 4 Wheelers in easy tips. Professional Lady Instructor at ur Convenience time & Place (Pickup & Drop). ✆ 9966372668.

BUSINESS SERVICES

JOIN OUR TEAM AS A CHANNEL PARTNER!
Retired Bank Employees, Insurance Professionals, and House Wife's Welcome!
NORTHSTAR HOMES & SPACES PVT.LTD,
A renowned name in the construction industry, invites enthusiastic and dedicated individuals to join.
CONTACT US: 99630 73355

లోన్స్ గోల్డ్ లోన్స్ / ప్రైవేట్ బ్యాంకుల్లో ఉన్న బంగారాన్ని విడిపించి అధిక ధరకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

బ్యాంక్ ప్రయివేట్ వ్యక్తుల వద్ద తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి అదే రోజు కేటాయించి కొనబడును. సంప్రదించండి. 9885154856.

BUSINESS OFFER

Options Trading Business Opportunity. Work & Earn from Home. Online/ Offline Classes at UR Flexible Time Ct: 8885683745.

Business Lease (No Rent No Interest) 3 Years Rs. 22 Lakhs For Water Plant & ICE Cubes Making Unit in Vizag. Ph: 7013347610, 9010144692

Good Running Guest House Business is for Sale or Need Sleeping Partner. Contact: 9966014545.

రెస్టారెంట్ అమ్మకం. పెందుర్తి పరిసర ప్రాంతంలో మంచి రన్నింగ్ రెస్టారెంట్ అమ్మబడును. ✆ 7799234582, 9381863550.

మంచి రన్నింగ్ కండిషన్ ఉన్న ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ కొత్త ప్రాజెక్ట్ కోసం పెట్టుబడిదారులు కావలెను. Ph.: 9705326666.

మహిళలు, నిరుద్యోగులు, ఇంటి వద్ద నుండి బిజినెస్ చేయుటకు సంప్రదించండి. ✆ 7013544075, 7842877904.

ప్రముఖ విద్యా సంస్థ 2012 నుండి No.1 రన్నింగ్ లో ఉన్న స్కూల్ అమ్మబడును. ✆ 7207792295.

FOR SALE

Good Running Bakery And Italian Restaurant with Equipment & Staff is for Sale. Kottapalem & Sujathanagar. ✆ 7989611499.

BUILDING CONSTRUCTION

uPVC Windows & Doors SERVICE
Contact: 7901234345

Aadhyadhvika Infra అతి తక్కువ Sq.Ft. (1599/-) రేటుతో, క్వాలిటీ మెటీరియల్తో, మన్నికైన బిల్డింగ్ నిర్మాణం చేయబడును. 200 గజాల లోపు స్థలంలో. Ph.: 9494253377.

Sahithya Constructions (R) ISO సర్టిఫైడ్ కంపెనీ అన్ని రకాల బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ SFt. 1800/- నుండి 2500/- వరకు చేయబడును. ✆ 6301529476.

BNR బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ అతి తక్కువ రేటులో నాణ్యమైన మెటీరియల్తో బిల్డింగ్ కాంట్రాక్టులు చేయబడును. సంప్రదించండి. 9603627999.

ARCHITECT & ENGINEERS

Civil Engineering Consultants for Building Plans, Apartments, Layouts, Industries and Total Station Surveys. Krishi Engineers Sarma: 9848139088.

WATER PROOFING

సింధియా, న్యూస్‌టుడే : భారతీయ తీరగస్తీదళం రీజనల్ కమాండర్(ఈస్ట్)గా అడిషనల్ డైరెక్టర్ జనరల్ **డాన్నీ మిఖాయిల్** నియమితులైనట్టు శనివారం విశాఖపట్నం ఐసీజీ కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. 1990 జులై 6న ఐసీజీ విధుల్లో చేరిన ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి, తటరక్షక్ పతకాన్ని సొంతం చేసుకున్నారని తెలిపాయి.

టేబుల్ టెన్నిస్‌లో మణికుమార్, రామ్‌జలి జయకేతనం



ట్రోఫీలు గెలుపొందిన క్రీడాకారులతో శారదా ప్రసాద్‌దాస్, తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టేబుల్‌టెన్నిస్(టీటీ) పోటీలు రెండో రోజు శనివారం గీతం డీమ్డ్ వర్సిటీలో ఉత్సాహంగా సాగాయి. అండర్-17, 19 బాలికలు, బాలుర విభాగాల్లో పోటీలు ముగిశాయి. పురుషుల సింగిల్స్ విభాగంలో పి.మణికుమార్ ప్రథమ, మహీధర్ వర్మ ద్వితీయ, మహిళ సింగిల్స్ విభాగంలో కేఎస్.రామ్‌జలి ప్రథమ, బి.శ్రేష్ఠ ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్-17 బాలికల విభాగంలో పి.హాసిని ప్రథమ, మౌపర్ణదాస్ ద్వితీయ, బాలుర విభాగంలో సామ్‌వేద్ ప్రథమ, సహర్ష సూర్య విక్రాంత్ ద్వితీయ స్థానం సాధించారు. అండర్-19 బాలికల విభాగంలో మౌపర్ణదాస్ ప్రథమ, జి.ఎస్.వారణాసి ద్వితీయ, బాలుర విభాగంలో మణికుమార్ ప్రథమ, మహీధర్‌వర్మ ద్వితీయ స్థానాల్లో గెలుపొందారు. విజేతలకు పతకాలు, ధ్రువీకరణ పత్రాలను ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజరు శారదా ప్రసాద్‌దాస్, డాక్టర్ సార్వభౌమ, కె.శ్రీకృష్ణమూర్తి, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.కె.నాయక్, డి.వి.ఎస్.వై.శర్మ అందజేశారు.

సిబ్బందికి రివార్డులు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : సిబ్బంది సంక్షేమంతో పాటు వారు అందించిన సేవల్లో ప్రతిభను గుర్తించిన సి.పి. పలువురికి రివార్డులు అందజేశారు. శనివారం నిర్వహించిన నెలవారీ సమీక్ష కార్యక్రమంలో గత నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 108 మంది సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ రివార్డులు అందజేశారు. రివార్డులు పొందిన వారిలో హోంగార్డు నుంచి సి.ఐ. స్థాయి అధికారుల వరకు ఉన్నారు.



రివార్డు అందజేస్తున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గుప్పెడంత గుండె.. దడదడ..!

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం

చిన్నారుల్లోనూ పెరిగిన హృద్రోగాలు

కేజీహెచ్‌లో ప్రత్యేక చికిత్స

న్యూస్‌టుడే, వన్‌టౌన్

కేజీహెచ్ పిల్లల వార్డులో ఇటీవల ఓ నవజాత శిశువు తీవ్ర అస్వస్థతకు గురైంది. కార్డియాలజీ విభాగానికి తరలించి వైద్య పరీక్షలు చేయగా గుండె సమస్య ఉన్నట్లు నిర్ధారించి వైద్యం అందించారు. కొద్దిరోజుల తర్వాత శిశువు పూర్తిగా కోలుకుంది.


విశాఖ గ్రామీణ ప్రాంతానికి చెందిన 50ఏళ్ల వ్యక్తి ఆకస్మికంగా గుండె నొప్పితో కుప్పకూలిపోయాడు. స్థానిక వైద్యులు సెమీ ప్రాజెక్టులో భాగంగా రూపొందించిన యాప్ ద్వారా కేజీహెచ్ కార్డియాలజీ విభాగ వైద్యుల సహాయం తీసుకుని బాధితునికి సకాలంలో వైద్యం అందించి ప్రాణం నిలిపారు.

హృద్రోగ బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తూ కేజీహెచ్ కార్డియాలజీ విభాగం బాసటగా నిలుస్తోంది. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఇక్కడ వసతులు ఉండడంతో చికిత్స కోసం వచ్చే బాధితులు ఏటికేడు పెరుగుతున్నారు. నేడు ప్రపంచ హృదయ దినోత్సవం. ఈ సందర్భంగా కేజీహెచ్ కార్డియాలజీ విభాగంలో బాధితులకు అందుతున్న వైద్య సేవలపై విభాగాధిపతి ఆదిలక్ష్మి వివరించారు.

13 పడకలతో ఐసీసీయూ వార్డు

కార్డియాలజీ విభాగంలో డాక్టర్ బి.ఆదిలక్ష్మి, డాక్టర్ ఎం.శ్రీనివాసమూర్తితో పాటు సహ ప్రొఫెసరు, ఇద్దరు సహాయ ప్రొఫెసర్లు, 8 మంది పీజీలు సేవలందిస్తున్నారు. 13 పడకలతో కూడిన ఐసీసీయూ (ఇంటెన్సివ్ కరోనరీ కేర్ యూనిట్), 15 పడకలతో ఇంటర్మీడియా వార్డు, మరో 35 పడకలతో కూడిన సాధారణ వార్డు ఉంది. వెంటిలేటరు పడకలు అందుబాటులో ఉన్నాయి.


➤ ఐసీసీయూ విభాగంలో 24 గంటలూ ఓపీ సేవలు అందుతాయి. హృద్రోగ సమస్యలతో బాధపడేవారు ఇక్కడికి నేరుగా వస్తే చికిత్స అందిస్తారు. వారానికి మూడు రోజులు ఈ ఓపీ విభాగాలు పనిచేస్తాయి.



మంగళ, గురువారాల్లో స్క్రీనింగ్ శిబిరాలు..: పిల్లల్లో గుండె జబ్బుల నిర్ధారణకు ప్రతి మంగళ, గురువారాల్లో కేజీహెచ్ కార్డియాలజీ విభాగం స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తోంది. 60 నుంచి 80 మంది శిశువులకు పరీక్షలు చేస్తారు. గుండె జబ్బులున్నట్లు తేలితే పిల్లల వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం పిల్లల్లో 10 నుంచి 20 శాతం వరకు గుండె జబ్బులు పెరిగాయని వైద్యులు చెబుతున్నారు. వడబోత కార్యక్రమాలు చేపట్టడం, తదితర కారణాల వల్ల కేసులు పెరిగినట్లు కనిపిస్తోందని వివరిస్తున్నారు. సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే పిల్లలు సైతం సాధారణ జీవితం గడపవచ్చునని కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మి చెబుతున్నారు.



కేజీహెచ్ ఐసీసీయూలో చికిత్స పొందుతున్న హృద్రోగులు



గత ఐదు నెలల్లో కేజీహెచ్‌కు వచ్చిన బాధితులు

నెల	ఓపీ	ఐపీ
ఏప్రిల్	2213	220
మే	2319	211
జూన్	2253	212
జులై	2549	270
ఆగస్టు	1907	238

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..



నడక గుండెకు చాలా మంచిది. 40 ఏళ్లు దాటిన వారు నడకతోపాటు శారీరక వ్యాయామం చేయడం, తాజా ఆహారం తీసుకోవడం, రక్తపోటు, మధుమేహాలను అదుపులో ఉంచుకోవడం, ఒత్తిడి తగ్గించుకోవడం చేయాలి. గుండె వ్యాధులు ఉంటే క్రమం తప్పకుండా ఔషధాలు తీసుకోవాలి. గుండె జబ్బుల నిర్ధారణ, చికిత్సలకు సంబంధించి కేజీహెచ్‌లో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయి. 24గంటలూ ఇక్కడ సేవలందిస్తున్నాం. పేస్‌మేకర్, యాంజియో క్లినిక్కులు నడుపుతున్నాం. నెలకు 30 నుంచి 40 మందికి స్టంట్లు వేస్తున్నాం. 3 నుంచి 5 మందికి పేస్‌మేకర్లు అమర్చుతున్నాం.

– డాక్టర్ బి.ఆదిలక్ష్మి, కార్డియాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు కమ్మ అవివాహిత యువతకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' కమ్మ అవివాహిత యువత కోసం ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలోని 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న యువతతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (ఆదివారం, సెప్టెంబరు 29న)** ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు **9154918858, 8008001686** ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

● ఫోన్ ద్వారా కూడా ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నెంబర్లకు పంపాలి.

–న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

యువతలోనూ గుండెజబ్బులు పెరిగాయి



వాక్‌థాన్ ప్రారంభిస్తున్న వైద్యులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తూ బీచ్‌రోడ్డులో శనివారం ఉదయం అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియాలజిస్టు డాక్టర్ బారువా మాట్లాడుతూ.. ఇటీవల యువతలోనూ గుండెపోట్లు పెరిగాయన్నారు. కరోనా తరువాత ఈ ప్రమాదం పెరిగిందన్నారు. వాక్‌థాన్ బీచ్‌రోడ్డులోని వై.ఎం.సి.ఎ. వరకు సాగింది. కార్యక్రమంలో డాక్టర్ పాణిగ్రాహి, డాక్టర్ శశాంక్, డాక్టర్ చక్రధర్, డాక్టర్ రామచంద్ర, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డులో కొనసాగుతున్న వాక్‌థాన్

చిట్‌ఫండ్స్ మోసాలకు అడ్డుకట్ట వేయాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగర పరిధిలో అనధికారికంగా చీటీలు వేయటం, డిపాజిట్లు సేకరించటం వంటివి చేస్తున్నారని.. దీనికి సంబంధించిన బడ్స్ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. శనివారం పోలీసు సమావేశమందిరంలో నెలవారీ నేర సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సాంకేతికతను ఉపయోగించుకుని సమర్థంగా పోలీసింగ్ చేపట్టాలన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద నేరం పునరావృతం చేస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. జె.సి.పి. ఫకీరప్ప, డి.సి.పి-1 అజితా వేజెండ్ల, డి.సి.పి.-2 తుహిన్‌సిన్హా, డి.సి.పి. (క్రైమ్) లతామాధురి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




సమీక్షలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ, ఇతర పోలీసు అధికారులు

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..

www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

చెవికి లేదా విశ్రాంతి..

పెరిగిపోతున్న వినికిడి సమస్యలు

నేడు చెవుడు నివారణ దినోత్సవం

న్యూస్‌టుడే, పెదవాల్తేరు


మనిషికి పంచేంద్రియాల్లో చెవులు ఎంతో ముఖ్యమైనవి. వినికిడి శక్తి లేకపోతే దైనందిన జీవితంలో చాలా ఇబ్బంది. కొంతమందికి అది పుట్టుకతో ఉండదు. దాన్ని అధిగమించడానికి కొన్ని ఆధునిక వైద్య పద్ధతులు వచ్చాయి.

అయితే మన చర్యల వల్ల బాగున్న వినికిడి శక్తిని కూడా మనం చేజేతులా కోల్పోతున్నాం. గతంతో పోలిస్తే చెవి, ముక్కు, గొంతు ఆసుపత్రులకు వచ్చేవారి సంఖ్య పెరగడమే దీనికి ఉదాహరణ.



ఇవి సాధారణం..: కొన్ని వినికిడి సమస్యలు జన్యుపరంగా వస్తాయి. పుట్టుకతోనే వినికిడి శక్తి ఉండదు. దీర్ఘకాలికంగా మందులు వేసుకోవడం ద్వారా కూడా కొంతమందికి చెవి సమస్యలు రావచ్చు.

» విషజ్వరాలు, క్షయ వ్యాధికి ఎక్కువగా మందులు వేసుకోవడం వల్ల కూడా కొన్నిచోట్ల చెవి సమస్యలు వస్తుంటాయి. ఇవి సాధారణం.



శబ్దాలు.. వాటి తీవ్రత డెసిబుల్స్(డి.బి.)లో..

శబ్దం	తీవ్రత
డీజే సౌండ్స్	100–110 డి.బి.
బాణసంచా	140 డి.బి.
హారన్స్	120 డి.బి.
విమానాలు, హెలికాప్టర్లు	100 డి.బి.
ఫ్యాక్టరీ సైరన్లు	120 డి.బి.
హెయిర్‌డ్రైయర్	90 డి.బి.
వాహనాలు	90 డి.బి.
సంభాషణలు	20 డి.బి.

కొన్ని చేజేతులా..


» స్మార్ట్ ఫోన్ల వినియోగం విస్తృతంగా ఉంది. ఇయర్‌ఫోన్లు పెట్టుకొని మాట్లాడటం.. పాటలు వింటాం సర్వసాధారణమైపోయింది. 20 డెసిబుల్స్ (డి.బి.) శబ్దం వరకు అయితే ఇబ్బంది లేదు. 30 దాటితే కాస్త ఇబ్బందే. 80కు చేరితే చెవికి ప్రమాదకరం. శాశ్వత వినికిడి సమస్యలు రావచ్చు.

» డీజే సంస్కృతి విస్తృతంగా పెరిగిపోయింది. అది మన చెవి వినగలిగే సామర్థ్యానికి మించి ఉంటుంది. 50 నుంచి 60 డెసిబుల్స్ శబ్దం వరకు మనకు ఇబ్బంది ఉండదు. కానీ డీజేల నుంచి 100 నుంచి 110 డి.బి. వరకు శబ్దం వస్తుంది. కొన్ని గంటల పాటు వరుసగా వింటే చెవిలో కర్ణభేరి దెబ్బతినే ప్రమాదం ఉంది.

» హారన్‌లు, విమానాలు, వాహనాలు, యంత్రాల ద్వారా వచ్చే కాలుష్యం వల్ల కూడా వినికిడి సమస్యలు వస్తాయి. అయితే ఆయా శబ్దాలు గంటల తరబడి వింటే ప్రమాదం. కొంతసేపు వింటే ఇబ్బంది లేదు.

పెరుగుతున్న కేసులు..

ఒక్క ప్రభుత్వ ఇ.ఎన్.టి. ఆసుపత్రినే తీసుకుంటే ఏటేటా వినికిడి సమస్యలతో వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. మరి నగరంలోని మిగతా ఆసుపత్రులను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండవచ్చు. ప్రభుత్వ ఇ.ఎన్.టి. ఆసుపత్రిలో ఏటేటా పెరుగుతున్న కేసుల వివరాలు ఇలా ఉన్నాయి.



నమోదైన ఓపీ

సంవత్సరం	ఓపీ
2022	87,020
2023	92,030
2024 (ఆగస్టు వరకు)	66,261

వినికిడి మనహక్కు..: ఇంట్లో, బయట శబ్ద కాలుష్యం బాగా పెరుగుతోంది. దీనివల్ల క్రమంగా వినికిడి శక్తి తగ్గిపోతుంది. చెవిలో ఉండే ఎయిర్ సెల్స్ దెబ్బతింటాయి. ప్రభుత్వాలు కొన్ని రకాల ధ్వనుల నియంత్రణకు చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఇయర్‌ఫోన్స్ ఎక్కువగా వాడి చేజేతులా సమస్యలు కొనితెచ్చుకోవద్దు.



– డాక్టర్ రామచంద్రరావు, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ ఇ.ఎన్.టి. ఆసుపత్రి

బాధితులు పెరిగిపోతున్నారు..: చెవి సమస్యలతో రోజూ వచ్చేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. రోజుకు సుమారు 500కుపైగా ఓపీ నమోదవుతోంది. చెవికి విశ్రాంతి లేకుండా చేసుకోవడం వల్ల మనమే సొంతంగా సమస్యలను కొని తెచ్చుకుంటున్నాం. యువతలోనూ ఈ తరహా పోకడలు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది.



డాక్టర్ హరికృష్ణ, ప్రభుత్వ ఇ.ఎన్.టి. ఆసుపత్రి సూపరింటెండెంట్

ఉక్కు కార్మికుల ఆందోళన

● విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్
● రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సమస్య పరిష్కారం



ప్రధాన గేటు వద్ద నిలిచిపోయిన ఉక్కు కార్మికులు

ఉక్కునగరం (స్టీల్‌సెక్టారు–3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి 30 శాతం ఒప్పంద కార్మికుల్ని తొలగించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు సుమారు 4 వేల మందికి ఆన్‌లైన్ పాస్‌లు రద్దు చేయాలని శుక్రవారం రాత్రి ఉక్కుశాఖ కార్యదర్శి నుంచి విశాఖ ఉక్కు యజమాన్యానికి సందేశం అందింది. దీంతో శనివారం ఉదయం ఉక్కు ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు పరిశ్రమ ప్రధాన ద్వారం, బీసీగేటు వద్ద ఆందోళనకు దిగారు. ప్రధాన పరిపాలన భవనం కూడలిలో నిర్వహించిన ధర్నాలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. ఉక్కు యాజమాన్యం ఏకపక్షంగా కార్మికుల్ని తొలగించడం సరైంది కాదని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నినదించారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చొరవతో..: ఈ అంశంపై రాష్ట్ర తెదేపా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ స్పందించి.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామితో మాట్లాడారు. వెంటనే ఒప్పంద కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం ఉక్కుశాఖ సంయుక్త కార్యదర్శి ద్వారా ఉక్కు యాజమాన్యానికి ఆదేశాలు రావడంతో కార్మికులు విధులకు హాజరయ్యారని కార్మిక నాయకులు పేర్కొన్నారు.

● ధర్నాలో కార్మిక నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, జె. అయోధ్యరామ్, యు.రామస్వామి, ఎన్. రామచంద్రరావు, వి. శ్రీనివాసరావు, వి. రామ్మోహన్‌కుమార్, ఎన్.సింహాద్రి, పి.వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

వరద బాధితులకు రూ.25 లక్షల సాయం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు సహాయం చేసేందుకు వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ ప్రతినిధులు ముందుకొచ్చారు. ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. సంబంధిత నగదు చెక్కును మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు శనివారం ఆయన నివాసంలో కలిసి అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ విరాళాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని గంటా అన్నారు. కార్యక్రమంలో తెదేపా భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, ఫిల్మ్‌నగర్ సొసైటీ ప్రతినిధులు కాలయ వెంకటరెడ్డి, ఎం.ఎస్.ఎన్.రాజు, భాస్కర్‌నాయుడు, కె.శివబాలాజీప్రసాద్, ఎ.ఎల్.ఎన్.రాజు, బి. సురేందర్‌రెడ్డి, ఆర్.వి.చంద్రమౌళి ప్రసాద్, బి.ఎన్.బి.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో వైజాగ్ ఫిల్మ్‌నగర్ సొసైటీ ప్రతినిధులు

వైభవంగా సింహాద్రినాథుడి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై కొలువైన అప్పన్న స్వామికి శనివారం నిత్య కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

బెల్లం వినాయకుడి లడ్డూ వేలం

రూ.14.30 లక్షలకు దక్కించుకున్న నిర్వాహకులు

సింధియా, న్యూస్‌టుడే : వినాయక చవితి సందర్భంగా గాజువాక డిపో వద్ద లంబోదర ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బెల్లం వినాయకుడి నిమజ్జనోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. స్వామికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూను వేలం వేయగా ట్రస్టు నిర్వాహకుడు మొల్లి శ్రీనివాస్ రూ.14,30,300లకు దక్కించుకున్నారు. విగ్రహం ఏర్పాటుకు ఉపయోగించిన బెల్లాన్ని ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేయాలని నిర్వాహకులు భావించారు. అయితే మూడు వారాల పాటు ఆరుబయట నిల్వ ఉండడంతో.. నాణ్యత తగ్గే అవకాశం ఉంటుందన్న పోలీసుల సూచనలతో బెల్లాన్ని గోనె సంచుల్లోకి సేకరించి నిమజ్జనం చేయడానికి తరలించారు. గాజువాక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



లడ్డూని తీసుకెళ్తున్న పాటదారులు

సరదాగా వచ్చి.. ప్రమాదం అంచులకు వెళ్లి..

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఐదుగురు స్నేహితులు శనివారం సాయంత్రం సరదాగా ఆర్.కె.బీచ్‌కు వచ్చారు. వీరందరూ సుమారు 4.30 గంటల సమయంలో సముద్ర స్నానం చేయడానికి దిగారు. పెద్ద కెరటం దాటికి వారిలో ఇద్దరు సముద్రం లోతుల్లోకి వెళ్లిపోయారు. మిగిలిన వారు కేకలు వేయడంతో అక్కడున్న లైఫ్‌గార్డులు సకాలంలో స్పందించిన నీటమునిగిపోతున్న పార్వతీపురానికి చెందిన సొమ్మూరి రంగారావు (21), చిత్తూరు జిల్లాకు చెందిన కొంపల్లి చైతన్య(21)లను రక్షించారు. లైఫ్‌గార్డులు ధనరాజు, నవీన్‌లు కౌన్సెలింగ్ చేసి వారిని పంపించారు.



నీట మునిగిన వారిని రక్షించి తీసుకున్న వస్తున్న లైఫ్‌గార్డులు

పేదింటి కుర్రోడికి పెద్ద కొలువు

కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల కెమికల్ బ్రాంచ్ విద్యార్థి గొలజాన చైతన్యకుమార్ ఇటీవల స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన పరీక్షల్లో ఎంపికయ్యాడు. ఏడాదికి రూ.10.40లక్షల ప్యాకేజీతో మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాడు.

కంచరపాలెం, న్యూస్‌టుడే



కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థికి రూ.10.40లక్షల ప్యాకేజీ

చైతన్యకుమార్‌ది పేద కుటుంబం. తల్లిదండ్రులు రవికుమార్, లక్ష్మి ఆనందపురం మండలం శొంఠ్యాం దరి గుమ్మడివానిపాలెంలో ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తుంటారు. చైతన్యకుమార్‌కు చదువుపట్ల ఆసక్తి ఉండడంతో ఉన్నకొద్దిపాటి సంపాదనతో తల్లిదండ్రులు అతడిని చదివించేందుకు శ్రమించారు. పదో తరగతిలో 90శాతం మార్కులు తెచ్చుకోగా డిప్లొమోలో 81శాతం మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. అతని బాబాయ్ రాంబాబు కాకినాడలో కేజీ బేసిన్‌లో సీనియర్ కెమికల్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బాబాయ్ ప్రోత్సాహం, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ, విభాగాధిపతి డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, సీనియర్ లెక్చరర్ విజయలక్ష్మి, లెక్చరర్లు ప్రదీప్, గీతికలు మద్దతుతో తాను మంచి ఉద్యోగానికి ఎంపికైనట్లు ఈ సందర్భంగా చైతన్యకుమార్ తెలిపాడు. ఒక్క చదువే గురించే కాకుండా భవిష్యత్‌లో ఏమి చేయాలి, ఎలా ఉండాలి, ఏమి సాధించాలనేది ఉపాధ్యాయులంతా తరచూ చెప్పేవారని అన్నాడు. వారు చూపిన మార్గమే తాను ఈ స్థితికి చేరుకోవడానికి ప్రధాన కారమన్నాడు.



చైతన్యకుమార్‌కి నియామక పత్రం అందజేస్తున్న కెమికల్‌బ్రాంచ్ హెడ్ డాక్టర్ లక్ష్మణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తదితరులు

అధ్యాపకులు చెప్పింది చేయాలి

కళాశాలలో అధ్యాపకులు చెప్పింది చేస్తే చక్కటి ఉద్యోగం సాధించేందుకు అవకాశాలు అనేకం ఉన్నాయని, జూనియర్లు ఈ విషయాన్ని గమనించి ఆచరించాలని చైతన్యకుమార్ పేర్కొన్నాడు. డిప్లొమోతో మంచి ప్యాకేజీ ఉద్యోగం రావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపాడు.

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గవర్నర్ - సత్యం సుందరం
రాములమ్మ - దేవర,
శాంత - దేవర, సప్తగిరి - దేవర
మహరాజ్ (ఆనందపురం) - దేవర

త్రోబాల్ పోటీల్లో రజతం

తగరపువలస, న్యూస్‌టుడే: విశాఖ ఏవీఎన్ కళాశాల క్రీడామైదానంలో శనివారం జరిగిన ఇంద్రాణి జగ్గారావు 34వ ఏపీ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో చిట్టివలస శ్రీకృష్ణా జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థి సీహెచ్. జ్యోతివర్మ సత్తా చాటాడు. చిప్పాడ గ్రామానికి చెందిన వర్మ రజత పతకం సొంతం చేసుకున్నాడు. దీంతో హైదరాబాద్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ బి.నర్సింగరావు, ప్రిన్సిపల్ సతీశ్ అభినందించారు.

భగత్‌సింగ్ జయంతి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి తెదేపా ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి శనివారం నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు జి.పోలిరాజు, ఎస్.జోగారావు, వి.పోతురాజు, కె.నాగరాజు, కె.సందర రావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: బీచ్‌రోడ్డు(రుషికొండ)కు వెళ్లే దారిలో పుట్‌పాత్‌లపై పలు దుకాణాలు పెట్టడంతో ఇబ్బందులు పడుతున్నాం. – శ్రీకాంత్, రుషికొండ

సమాధానం: పుట్‌పాత్‌లపై దుకాణాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – సింహాచలం, జోన్-2 కమిషనర్

ట్యాంకు ఇలా.. శుభ్రత ఎలా..



ఎండాడ, న్యూస్‌టుడే: రాజీవ్‌నగర్ (ఎండాడ) ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న మంచినీటి ట్యాంకు మెట్లు శిథిలమయ్యాయి. ఫలితంగా ట్యాంకు పైకి వెళ్లి శుభ్రం చేసేందుకు వీలు లేకుండాపోయింది. దీన్ని శుభ్రం చేసి చాలా కాలమైంది. ప్రస్తుతం మోటారు ద్వారా అందులోకి నీటిని పంపిస్తున్నారు. అక్కడి నుంచి సరఫరా అయ్యే నీరు కలుషితం అవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ మంచినీటి సరఫరా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మెట్ల మార్గానికి మరమ్మతులు చేపట్టి, ట్యాంకును శుభ్రం చేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిర్లక్ష్యపు మాటున ప్రమాదం..!

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి ముబారక్‌కాలనీ నుంచి గొల్లల ఎండాడ, రాజీవ్‌నగర్, దసపల్లాలేఅవుట్ తదితర ప్రాంతాల వెంబడి ఎక్కడికక్కడ గోతులు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. తాగునీటి పైప్‌లైన్ల కోసం తవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆదమరిచి అటుగా వెళ్తే ప్రమాదం బారిన పడటం ఖాయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో పూడ్చకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ముబారక్‌కాలనీకి వెళ్లే దారిలో ఇలా..

● 'ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీటు తూర్పుకాపులకు కేటాయించాలి'

ఆనందపురం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తూర్పు కాపు సామాజిక వర్గానికి అవకాశమివ్వాలని రాజాం తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు ఎస్.రమేష్‌కుమార్ కూటమి పార్టీల అధినాయకత్వాన్ని కోరారు. శనివారం ఆనందపురంలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో అధిక జనాభా ఉన్న తూర్పు కాపులకు ప్రాధాన్యమిచ్చి సంబంధిత సీటుని కేటాయించాలన్నారు. అందుకు తూర్పుకాపు సామాజిక వర్గ నాయకులు మండలాల వారీగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

● మెప్మా మార్కెట్ స్టాల్స్ ఏర్పాటు

తగరపువలస, న్యూస్‌టుడే: రెండోవార్డు తగరపువలసలో యూసీడీ ఆధ్వర్యంలో మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. భీమిలి జోనల్ కమిషనరు పి.ప్రేమ ప్రసన్నవాణి వీటిని ప్రారంభించి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు ఇది దోహదపడుతుందన్నారు. యూసీడీ భీమిలి జోన్ ఏపీడీ సంతోశ్‌కుమార్, తెదేపా నాయకులు, మాజీ కౌన్సిలర్లు కొప్పల రమేశ్, పిట్టా సురేశ్, పిట్టా వెంకటరావు, బడిగంటి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

● జాతీయ రైఫిల్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

మధురవాడ, న్యూస్‌టుడే: గోవాలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి రైఫిల్ ఓపెన్ పోటీల్లో మధురవాడ శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిమ్స్) కళాశాల బీబీఏ విద్యార్థి ఎ.మణికంఠ రజత పతకం సాధించాడు. ఏపీ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాల్గొన్నట్లు కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్ అన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ సాయిప్రశాంత్, ప్రిన్సిపల్ లారెన్స్, వ్యాయామ విభాగం సంచాలకులు రమేష్ తదితరులు అభినందించారు.

● ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం: స్వర్ణాంధ్ర-2047 సాధించే కృషిలో భాగంగా భీమిలిలో శనివారం మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు భీమిలిలోని పొట్టి శ్రీరాములు జీవీఎంసీ హైస్కూల్లో ఎంఈవోలు ఎం.శివరాణి, ఎ.జయప్రద ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో జి.మహేశ్వరి (ఏపీఆర్ఎస్), జి.రామేశ్వర్ (రాయిపాలెం జీవీఎంసీ హైస్కూలు).. వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో డి.దీప్తి (కేజీబీవీ), పి.మేఘన (భీమిలి జీవీఎంసీ హైస్కూలు) నిలిచారు. వీరిని త్వరలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

● గ్రామాల్లో 'మన ఇల్లు-మన గౌరవం'

చిప్పాడ(గ్రామీణభీమిలి): 'మన ఇల్లు - మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం అమనాం పంచాయతీలో ఎంపీడీవో ఎన్.హనుమంతు రావు ఆధ్యక్షతన గృహనిర్మాణ లబ్ధిదారులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. త్వరితగతిన ఇళ్లను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం చేపలుప్పాడ, కాపులుప్పాడ, కె.నగరపాలెం, నిడిగట్టు, జేవీ అగ్రహారం, దాకమర్రిల్లోనూ ఈ సభలు జరిగాయి. పంచాయతీ విస్తరణాధికారి అప్పలరాజు, గృహనిర్మాణ శాఖ సహాయ ఇంజినీరు హుస్సేన్, మండల ఏఈ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● శ్రీ బాసర కళాశాలలో టాలెంట్ షో

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస శ్రీబాసర డిగ్రీ కళాశాలలో టాలెంట్ షో శనివారం నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని నృత్యాలు, పాటలు, మిమిక్రీ ప్రదర్శించారు. కళాశాల ఛైర్మన్ పూడి రమేశ్ విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాళ్లు సీహెచ్.సురేశ్ (డిగ్రీ), వీవీడీ రమేశ్(జూనియరు), వైస్ ప్రిన్సిపాళ్లు ఎం.శ్రీనివాసరావు, భాస్కరరావు, ఏవో కేశవ, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పార్టీ సభ్యత్వం జరగాలి: గంటా



భీమిలి ఐ-టీడీపీ ప్రతినిధులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి నియోజకవర్గంలో చేపట్టనున్న తెదేపా సభ్యత్వ నమోదు. . రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. విశాఖలో తన స్వగృహంలో నియోజకవర్గ ఐ-టీడీపీ సభ్యులతో శనివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్టోబరు 2 నుంచి ప్రారంభించనున్న సభ్యత్వ కార్యక్రమం గురించి చర్చించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో పార్టీ గెలుపులో భీమిలి నియోజకవర్గం మెజార్టీలో రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీశ్రేణులు పని చేయాలన్నారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, విశాఖ పార్లమెంట్ జిల్లా ఓటరు ధ్రువీకరణ, పోలింగ్ కో-ఆర్డినేటర్ వినీత్, భీమిలి నియోజకవర్గ ఐ-టీడీపీ అధ్యక్షుడు మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి జె.పి.రాజు, ఉపాధ్యక్షుడు పాసి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మూలకుద్దులో కేంద్ర బృందం పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం ప్రతినిధులు గైక్వాడ్, అగార్కర్

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి గ్రామీణ మండలంలోని మూలకుద్దు గ్రామంలో సునీల్ గైక్వాడ్, అగార్కర్ నేతృత్వంలోని కేంద్ర బృందం శనివారం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో ప్రజలతో గ్రామసభ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, సామాజిక భద్రత పింఛన్లు, గృహనిర్మాణ పథకం, వాటర్‌షెడ్ కార్యక్రమాలపై సమీక్షించారు. భీమిలి మండల పరిషత్తు అభివృద్ధి అధికారి ఎన్.హనుమంతురావు, పంచాయతీ విస్తరణాధికారి జి.అప్పలరాజు, వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు బి.రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో 1న కృష్ణమయ్య జయంతి



సింహాచలం, న్యూస్‌టుడే: బాద్రపద కృష్ణపక్ష చతుర్దశి పురస్కరించుకుని ప్రథమాంధ్ర వచన కవితా పితామహుడిగా కీర్తి పొందిన శ్రీకాంత కృష్ణమాచార్యుల జయంతి సింహగిరిపై అప్పన్న స్వామి దేవాలయంలో వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆదివారం నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు సింహగిరిపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఆలయ రాజగోపురం దరి కళావేదిక వద్ద జ్యోతి ప్రజ్వలన, కృష్ణమయ్య చిత్రపటం ఆవిష్కరణ జరుగుతాయన్నారు. సాయంత్రం 4 నుంచి కృష్ణమయ్య సాహిత్యం సంకీర్తనలు, నృత్య ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. 30న కూడా ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. 1న ఉదయం 9 గంటల నుంచి ఆలయ బేడా మండపంలోని కృష్ణమయ్య విగ్రహం వద్ద దీపారాధనలు, వచన పదార్చన, శోభాయాత్ర జరుగుతాయని వివరించారు.

గ్రామీణ మండలాల్లో అభివృద్ధి పనులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: భీమిలి నియోజకవర్గం పరిధిలోని ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో గ్రామాల వారీగా సీసీ రోడ్లు, కాలువలు, వంతెనల నిర్మాణ పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నామని మాజీమంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఇందుకు రూ.15.97 కోట్లు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయన్నారు. సంబంధిత పనులను 2025 మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు వరుసగా రూ.5.88 కోట్లు, రూ.5.77 కోట్లు, రూ.4.32 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.

పుష్కర ఘాట్ ప్రారంభం

చిప్పాడ(తగరపువలస), న్యూస్‌టుడే: చిప్పాడ దివీస్ ల్యాబ్స్ ఆర్థిక సాయంతో టి.నగరపాలెం వద్ద నిర్మించిన పుష్కర ఘాట్‌ను సర్పంచి పొట్నూరు చాయాగౌతమి, మాజీ సర్పంచి పొట్నూరు రాము శనివారం ప్రారంభించారు. కార్తిక మాసం రానున్న నేపథ్యంలో ఇక్కడ గోస్తనీ నదిలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.12.85 లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. తెదేపా నేతలు తమ్మిన వెంకటరమణపాత్రుడు, జనసేన నాయకుడు ఇద్దిపల్లి నాని, దివీస్ సీఎస్ఆర్ మేనేజరు సురేశ్‌కుమార్ దేవళ్ల పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

చేపలుప్పాడ(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: వినాయక ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ నాల్గోవార్డు చేపలుప్పాడ సరదా బోయ్స్, క్రేజీ బోయ్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. సుమారు ఆరువేల మందికి అన్నదానం చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధి దౌలపల్లి కొండబాబు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త కోరాడ రాజబాబు, జడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు బోర బంగారరెడ్డి, తెదేపా, జనసేన భీమిలి మండలశాఖ అధ్యక్షులు డీఏఎన్ రాజు, నక్కా శ్రీధర్, పాసి నర్సింగరావు, మాజీ సర్పంచి కారి అప్పారావు, చీపిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 14 నుంచి ఐశ్వర్య వేంకటేశ్వరుని పవిత్రోత్సవాలు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు, భక్తులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి తృతీయ తిరు పవిత్రోత్సవాలు అక్టోబరు 14 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. సంబంధిత గోడపత్రికను శనివారం ఆలయంలో ఆవిష్కరించారు. దేవాలయ ట్రస్టీలు కె.సూర్యనారాయణమూర్తి, కె.శ్రీరామచంద్రమూర్తి, దేవాలయ అర్చకుడు పి.శేషాచార్యులు, పవన్‌విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వారపు సంత తరలింపును అడ్డుకున్న చిరువర్తకులు



నిరసన తెలుపుతున్న వర్తకులకు సూచనలు ఇస్తున్న జీవీఎంసీ, పోలీసు యంత్రాంగం

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ, పోలీసు యంత్రాంగం సంయుక్తంగా శనివారపు సంతను తరలించాలని చేస్తున్న కృషి ఫలించలేదు. ఇక్కడ నుంచి వెళ్తే వ్యాపారాలు నష్టపోతాయని చిరువర్తకులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ జోన్-2 కార్యాలయం నుంచి చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వరకూ నిర్వహించే సంతను కొమ్మాది మాస్టర్‌ప్లాన్ రహదారిలోకి తరలించేందుకు ముందస్తుగా పీఎంపాలెం పోలీసులు, జీవీఎంసీ యంత్రాంగం శనివారం అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ చిరువర్తకులు అక్కడకు వెళ్లేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. జెడ్సీ పి.సింహాచలం, సీఐ ఎస్.కాంతారావు, ఎస్ఐలు సురేశ్, విజయ్‌కుమార్‌లతో పాటు తెదేపా నేతలు మొల్లి లక్ష్మణ్‌రావు, వాండ్రాసి అప్పలరాజు తదితరులు చిరువర్తకులతో కలిసి చర్చించారు. సేవా రహదారిలో పుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో ప్రమాదాల బారిన పడుతున్నారని అధికారులు తెలిపినా చిరువర్తకులు అంగీకరించలేదు. అక్కడకు వెళ్తే వినియోగదారులు వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి సీఐటీయూ నాయకులు అప్పలరాజు, రాజ్‌కుమార్ తదితరులు అండగా నిలిచి జోనల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీంతో అధికారుల ప్రయత్నాలు విఫలం కావడంతో యథావిధిగా సంత కొనసాగింది.

వార్డు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం అందిస్తున్న తెదేపా నాయకులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఆరోవార్డులో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలపై, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులు, తెదేపా వార్డు అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. వార్డులో వీధి దీపాలు సక్రమంగా వెలగక కాలనీల్లో చీకట్లు అలుముకుంటున్నాయన్నారు. శ్మశానవాటికల్లో సదుపాయాల కల్పన, రోడ్లు, కాలువల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల సర్వదేవుళ్లు, షేక్ సుభాని, లొడగల జానకీరామ్, రామకృష్ణ, బలరామమూర్తి, కె.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న కేజీబీవీ ఎస్.ఎం.సి. ప్రతినిధులు, ఉపాధ్యాయినులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ చిల్డ్రన్స్ థియేటరులో నిర్వహించిన పోటీల్లో భీమిలి కేజీబీవీ విద్యార్థినులు సత్తా చాటారు. చిత్రలేఖన పోటీల్లో బి.ప్రవళిక తృతీయ స్థానం, వ్యాసరచన పోటీల్లో జి.ధరణి తృతీయ స్థానం, వై.ఉమాలహరి కన్సోలేషన్ బహుమతులను సాధించారు. పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రధానాచార్యులు గంగాకుమారి, పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్.ఎం.సి) ఛైర్మన్ సి.హెచ్.కుమార్, వైస్‌ఛైర్మన్ కె.రమణమ్మ వీరిని అభినందించారు.

30లోపు ఆస్తిపన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

కొమ్మాది: జీవీఎంసీ జోన్-2 పరిధిలో 5 నుంచి 13 వార్డుల్లోని ఆస్తిపన్ను చెల్లింపుదారులంతా ఈ నెల 30వ తేదీలోపు పన్ను చెల్లించాలని జడ్సీ పి.సింహాచలం, ఆర్వో శివకుమార్ తెలిపారు. నిర్ణయించిన తేదీ నాటికి బకాయిలు చెల్లిస్తే వడ్డీ ఉండదని.. అక్టోబరు 1వ తేదీ నుంచి వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఉత్సవాలకు ఉడుపురాట

పీఎంపాలెం, న్యూస్‌టుడే: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పీఎంపాలెం గాయత్రీనగర్ కాలనీలో శనివారం ఉడుపురాట మహోత్సవం నిర్వహించారు. తెలుగు యువత పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గరే గురునాథ్, తెదేపా బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, కె.రామకృష్ణ, కొల్లి బాబ్జీ తదితరులు హాజరయ్యారు. కమిటీ సభ్యులు రమేష్, వెంకటేష్, రమణ, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: తగరపువలస బాలాజీనగర్‌లో నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రులకు శనివారం పందిరిరాట వేశారు. స్థానిక యువజన సంఘం ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలరు జగ్గుపల్లి ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

కె.నగరపాలెం(గ్రామీణభీమిలి): భీమిలి బీచ్‌రోడ్డులోని పెద మంగమారిపేట వీబీసీ కాలనీలో శనివారం పందిరిరాట వేశారు. కమిటీ ప్రతినిధులు చీపుళ్ల మహేశ్, చెన్నా అమ్మోరు, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ్‌కుమార్

పద్మనాభం, న్యూస్‌టుడే: అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను తక్షణమే పూర్తి చేయాలని ఎంపీడీవో బి.విజయ్‌కుమార్ సూచించారు. మన ఇళ్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా రెడ్డిపల్లిలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 1001 ఇళ్లు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయన్నారు. లబ్ధిదారులు ముందుకొచ్చి సంబంధిత పనులు చేపడితే త్వరితగతిన బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణశాఖ ప్రత్యేక అధికారిణి డి.ఎస్.సునీత, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో అవగాహన సదస్సులు జరిగాయి.

యువకుడిని రక్షించిన లైఫ్ గార్డులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ సాగర తీరంలో కెరటాల్లో చిక్కుకున్న యువకుడిని టూరిజం, జీవీఎంసీ లైఫ్ గార్డులు శనివారం రక్షించారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దీవీ (17) మరో ఇద్దరు కుటుంబ సభ్యులతో కలిసి రుషికొండ తీరంలో ఈతకు దిగాడు. ఒక్కసారిగా కెరటాలు ఎగిసి పడటంతో అలల్లో చిక్కుకున్నాడు. లైఫ్ గార్డులు వెంటనే స్పందించి యువకుడిని రక్షించి తీరానికి తీసుకొచ్చారు.



యువకుడితో లైఫ్‌గార్డులు

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM

E.P.No. 26/2020 In Dispute No. 423/2015

Between:
M/s. Margadarsi Chit Fund Private Limited, Seethammapeta Branch Visakhapatnam ...**Decree Holder**
And:
Mr. K.Bhaskara Rao and 5 others ...**Judgment Debtors**

PROCLAMATION OF SALE

Notice is hereby given that by an order of the Court named above, the property of 5th Jdr (i.e. **Pentapalli Dhana Lakshmi, W/o. Chandra Sekhar)** mentioned in the schedule hereunder has been ordered to be sold by public auction in satisfaction of the claim of the decree holder mentioned in the above E.P. for sum of Rs. 11,80,024/- (excluding publication charges and battas) up to the date of sale in the aforesaid dispute against the judgement debtor mentioned above.

Public are hereby informed that the sale will be by public auction and the same will be held between **10-30 A.M. to 05-00 PM on 17-10-2024** at public court i.e., PRINICIPAL JUNIOR CIVIL JUDGE'S COURT, BHEEMUNIPATNAM. At the sale the public are generally invited to bid, either personally or by duly authorised agent subject to terms and conditions to sale which may be had from the counsel for the decree holder whose address particulars are furnished hereunder.

SCHEDULE OF PROPERTY

The Immovable Property of Jdr 5: Visakhapatnam District, Madhurawada Sub Registry, Patta No. 585, Covered by Survey No. 4/3, built in 1418 Sft. (Including Common area) and 80 Sft. Car Parking vide Document No. 6385/2015, Flat No. 402, 3rd Floor in J.J. Mansion Apartment, Madhurawada Village, Visakhapatnam within the limits of Greater Visakhapatnam Municipal Corporation and bounded as follows:

East: Open to Sky	**South:** Open to Sky
West : Common Corridore	**North:** Common Corridore

DHR's Value: Rs. 30,00,000/-
FA's Value : Rs. 50,00,000/-
JDR's Value: Not known as the Jdr did not furnish the same.

Bheemunipatnam
Dt. 28-09-2024

P.MURALI GOPAL Advocate,
Visakhapatnam-530016.
Cell: **98483 20248**


విశాఖ తూర్పు

27 కిలోల గంజాయి స్వాధీనం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి అక్రమ రవాణాపై వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 19 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం దువ్వాడ స్టేషన్‌కు అప్పగించారు. ద్వారకా పోలీసుస్టేషన్ పరిధిలోని రామాటాకీస్ దరి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ద్వారకా స్టేషన్‌కు అప్పగించారు.

వరద బాధితులకు విరాళాల అందజేత

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు వస్తున్నాయి. ఎస్.వి.కిశోర్‌చంద్రదేవ్ డిగ్రీ కళాశాల నుంచి రూ.51,116లు, విజయనగరం మాన్సాస్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ రూ.2,50,000ల చెక్కులను శనివారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు చేతికి అందించారు. ఈ మొత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించాలని కోరారు. వారిని రిజిస్ట్రార్ అభినందించారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టి.వి.కృష్ణ, ఆయా కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏయూ రిజిస్ట్రార్‌కు చెక్కు అందిస్తున్న ఎస్.వి కిశోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాల ప్రతినిధి

ఏయూ విజిలెన్స్ అధికారిగా చిట్టిబాబు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం కెమికల్ ఇంజినీరింగ్ ఆచార్యులు ఎన్.చిట్టిబాబు ఏయూ విజిలెన్స్ అధికారిగా నియమితులయ్యారు. ఆయన రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు నుంచి ఉత్తర్వులు అందుకున్నారు.

ముగిసిన కార్యశాల

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం భూ విజ్ఞాన శాస్త్ర విభాగంలో జరుగుతున్న రెండు రోజుల కార్యశాల శనివారంతో ముగిసింది. ఈ కార్యశాలలో రెండోరోజు మైనింగ్ ప్రాసెసింగ్, బీచ్‌శాండ్స్ పరిశ్రమల్లో ప్రస్తుత పోకడలు, విలువ ఆధారిత మైనింగ్, న్యాయ, చట్టాల గురించి చర్చించారు. కార్యక్రమ కన్వీనర్ ఆచార్య కె.సత్యనారాయణ, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఆచార్య ఎ.యుగంధరరావు తదితరులు పాల్గొన్నారు.

జాషువా రచనలు సమాజాన్ని జాగృతం చేస్తాయి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : గుర్రం జాషువా జయంతి వేడుకలు ఏయూ ఆర్ట్స్ కళాశాలలో జరిగాయి. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.వెంకట్ మాట్లాడుతూ.. జాషువా రచనలు సమాజాన్ని జాగృతం చేస్తాయన్నారు.

✦ కేఆర్ఎంకాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శనివారం గుర్రం జాషువ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అంతర్వేది యాత్రాదర్శిని పుస్తకావిష్కరణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని కోనసీమ జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం అంతర్వేదిపై 'అంతర్వేది యాత్రాదర్శిని' పేరుతో రాసిన పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించినట్లు పుస్తక రచయిత డాక్టర్ కె.ఎం.రమేష్ తెలిపారు. సిరిపురం బాలల ప్రాంగణంలో పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఈ పుస్తకావిష్కరణ జరిగిందన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆసుపత్రి ముందు బాధితుల ధర్నా

ఆరిలోవ, న్యూస్‌టుడే: హెల్త్ సిటీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ముందు శనివారం ఉదయం రోగి బంధువులు ధర్నా చేశారు. విజయనగరం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి కడుపునొప్పితో ఈనెల 19న హెల్త్‌సిటీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. రోగికి అవసరమైన శస్త్రచికిత్స చేశారు. శుక్రవారం రాత్రి రోగి చనిపోయారు. వైద్యుల నిర్లక్ష్యం వల్ల రోగి చనిపోయారని అతని బంధువులు ఆసుపత్రి ముందు ధర్నా చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆరిలోవ పోలీసులు వచ్చి అదుపు చేశారు. అయితే దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

ఘనంగా ప్రపంచ రేబిస్ దినోత్సవం

ఆరిలోవ, న్యూస్‌టుడే: తోటగరువులో ఉన్న ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా కుక్కలను పెంచే వారికి కుక్కలు అనారోగ్యం పాలవకుండా అవగాహన కల్పించామని ఆసుపత్రి సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.అనూష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



శునకానికి రేబిస్ టీకా వేస్తున్న డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు

గాడి తప్పిన పారిశుద్ధ్యం

ఇంటింటి చెత్త సేకరణ అంతంతమాత్రమే

నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇంటింటి చెత్త సేకరణ కూడా అంతంతమాత్రంగానే జరుగుతోంది. స్వచ్ఛతకు పెద్దపీట వేస్తామని చెబుతున్న అధికారులు నిర్వహణ పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. రోజు విడిచి రోజు జరగాల్సిన ఇంటింటి చెత్త సేకరణ విషయంలోనూ సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ లేదనే చెప్పాలి. ఏ రహదారులను చూసినా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి.

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ



కానరాని శానిటరీ కార్యదర్శులు... ప్రతీ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌కు నగరం సిద్ధమవుతోంది. ఇందులో ఇంటింటి నుంచి చెత్తను సేకరించటం, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించటం వంటి పనులతో ప్రజల్ని కూడా భాగస్వాముల్ని చేస్తారు. అయితే ఇంటింటి చెత్త సేకరణను రోజు విడిచి రోజు చేపడుతుంటే, అదేవిధంగా రహదారుల శుభ్రతను కూడా రోజు విడిచి రోజు చేస్తున్నారు.

■ ఇంటింటి చెత్త సేకరణకు ప్రత్యేకంగా వాహనాలను కేటాయించారు. నియోజకవర్గంలో సుమారు 120కు పైగా క్లాప్ వాహనాలున్నాయి. ఈ వాహనాలను ఆయా సచివాలయాల వారీగా మ్యాపింగ్ చేశారు. మ్యాపింగ్ ప్రకారం సచివాలయ శానిటరీ కార్యదర్శి ప్రతీరోజూ ఉదయం ఇంటింటి చెత్తసేకరణలను దగ్గరుండి పర్యవేక్షించాల్సి ఉంటుంది. వారు కూడా శానిటరీ సిబ్బంది మాదిరిగా ఉదయం 6 గంటలకు చేరుకుని.. హాజరువేసి 10 గంటల వరకు విధులు నిర్వహించాలి. తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు పారిశుద్ధ్య నిర్వహణను చూడాల్సి ఉంటుంది. గతంలో మాదిరిగా ఇంటింటి యూజర్ ఛార్జీల వసూలు కూడా ప్రస్తుతం లేదు. దీంతో వీరికి కేటాయించిన సమయాల్లో విధులను నిర్వహించాల్సి ఉన్నా, ఆయా సమయ పాలన పాటించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

■ ఉదయం జరిగే ఇంటింటి సేకరణ ఏ విధంగా జరుగుతోంది? ఎన్ని ఇళ్ల నుంచి సేకరించారు? ఎన్ని ట్రిప్పులు వాహనం తిరిగింది వంటివి పట్టించుకోవాల్సిన శానిటరీ కార్యదర్శులు కనీసం వార్డుల్లో కనిపించని పరిస్థితి నెలకొంది. హాజరు వేసిన తర్వాత ఒకటి రెండు చోట్ల మినహా మరెవ్వరూ వార్డుల్లో కనిపించటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగని సచివాలయాల్లో కూడా ఉండటం లేదని ఆయా ప్రజారోగ్య సిబ్బందే బాహాటంగా చెబుతున్నారు.

■ దీంతో వాహనాల ద్వారా వ్యర్థాలను సేకరించేవారు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నాలుగు రోజులకు ఒకసారి వ్యర్థాలను సేకరిస్తున్నారనే విమర్శలున్నాయి. సమయపాలన అనేది పాటించటం లేదు. దీంతో ఇళ్లలోనే వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కొన్ని ఇళ్ల నుంచి సేకరించి, మరి కొన్ని ఇళ్లను పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

■ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మాత్రం రహదారులు, కాలువల శుభ్రతపై దృష్టిసారించి, వాహనాల ద్వారా వ్యర్థాల సేకరణను పక్కన పెట్టేసినట్లుగా తెలుస్తోంది. పలు వార్డుల్లో సిబ్బంది తక్కువగా ఉండటంతో రహదారుల శుభ్రత విషయంలోనూ అలసత్వం వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజారోగ్య విభాగ అధికారులు ఇంటింటి వ్యర్థాల సేకరణను పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : సింహాద్రిపురం లక్ష్మీనరసింహ నగర్‌లోని హెచ్.బి.కాలనీ కొండవాలులో వీధి దీపాలు వెలగటం లేదు – సుధాకర్

సమాధానం : పరిశీలించి చర్యలు తీసుకుంటాం – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-2 వెస్ట్రన్ పార్కు వద్ద వ్యర్థాలు తరలించటం లేదు – వీరా స్వామి

సమాధానం : సిబ్బందిని నియమించి వ్యర్థాలను తరలిస్తాం – సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

నేడు స్వచ్ఛతాహీ సేవపై పోటీలు



స్వచ్ఛతాహీ సేవ ప్రచారంలో పాల్గొన్న జె.వి.రత్నం తదితరులు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : స్వచ్ఛతాహీ సేవ-2024 అంశంపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నేతృత్వంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామని గ్రీన్ క్లైమెట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పేర్కొన్నారు. శనివారం ఎంవీపీకాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం నుంచి మురళీనగర్‌లోని జేఆర్ ఫంక్షన్‌హాలులో పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమన్వయకర్తలు రవితేజ, కృష్ణకుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌కు వాకర్స్ విరాళం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : అన్నక్యాంటీన్ నిర్వహణలో భాగంగా విశాఖ శాటిలైట్ సిటీ వాకర్స్ అసోసియేషన్ శనివారం మధ్యాహ్నం 400 టోకెన్లకు అవసరమైన ఖర్చును విరాళంగా అందజేసింది. చెక్కు రూపంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కిశోర్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎన్టీఆర్, డాక్టర్ పప్పూర్ నికుంజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విరాళ చెక్కును అందజేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

పోలమాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో వచ్చేనెల 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. వాటికి సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. శనివారం ఉదయం తెదేపా కార్యాలయానికి దేవాదాయశాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ఆలయ ఈవో గాయత్రీలతో పాటు ఆలయ సిబ్బంది ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రికను ఆయనకు అందజేశారు. తెదేపా నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థానం ఈవోకు సత్కారం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఏయూ పూర్వ విద్యార్థి, సింహాచలం దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన వి.త్రినాథరావును రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్, డాక్టర్ వెంకటనాయుడులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. సింహాచలం దేవస్థానం ప్రతిష్ఠను మరింతగా పెంచాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు.

అక్టోబర్ 2న ఉపాధ్యాయుల సత్యాగ్రహ దీక్ష

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ అక్టోబర్ 2న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్‌లు తెలిపారు. శనివారం విద్యాశాఖాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ సుందర్‌సింగ్‌కు సత్యాగ్రహదీక్ష నోటీసు అందజేశారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా పాల్గొని దీక్షను విజయవంతం చేయాలని కోరారు.



సత్యాగ్రహ దీక్ష నోటీసు అందిస్తున్న ఉపాధ్యాయులు

వి.ఐ.పి. భద్రతా సిబ్బందికి ముగిసిన శిక్షణ



శిక్షణ ముగింపులో భద్రతా సిబ్బందితో సి.పి. శంఖబ్రత బాగ్చీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : పర్సనల్ సెక్యూరిటీ అధికారి(పీఎస్‌ఓ)లకు నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అభ్యర్థనతో రాష్ట్రంలోనే మొదటిసారిగా రాష్ట్ర ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్(ఐఎస్‌డబ్ల్యూ) నుంచి అనుభవజ్ఞులైన అధికారులు నగరానికి వచ్చి శిక్షణా తరగతులు నిర్వహించారు. వి.ఐ.పి. భద్రత కోసం చాకచక్యంగా తీసుకోవాల్సిన చర్యలతో పాటు పలు భద్రతా చర్యలపై తగిన శిక్షణ ఇవ్వటం జరిగింది. శనివారం శిక్షణ ముగింపులో భాగంగా తాము నేర్చుకున్న అంశాలను పలువురు భద్రతా సిబ్బంది వివరించారు.

అమ్మవారి ఆలయం ప్రారంభం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : మత్స్యకార గ్రామమైన వాసువానిపాలెం, శివగణేష్‌నగర్, మూలపాలెం గ్రామ దేవత కొత్తమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవం శనివారం భక్తి శ్రద్ధలతో జరిపారు. శనివారం ఆలయాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఆయన సతీమణి సుజన, తెదేపా నాయకులు అక్కరమాని వెంకట్రావులు ప్రారంభించి పూజలు జరిపారు. అనంతరం గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు జరిపారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, మత్స్యకార గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఏయూ న్యాయ కళాశాల ఆవరణలో 'స్వచ్ఛతాహీ సేవ'



చెత్తను సేకరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ఆవరణలో శనివారం 'స్వచ్ఛతాహీ సేవ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. న్యాయ కళాశాల ప్రాంగణంలో గల వ్యర్థాలను ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్ల, కళాశాల విద్యార్థులతో కలసి రిజిస్ట్రార్ శుభ్రపరిచారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.సీతామాణిక్యం, ఎన్.ఎస్.ఎస్.సమన్వయకర్త ఆచార్య ఎన్.హరనాథ్, డాక్టర్ పల్లవి, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద ఖైదీలకు న్యాయ సహాయం

ఆరిలోవ, న్యూస్‌టుడే : జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ శనివారం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో మాట్లాడారు. ఆర్థిక స్తోమత లేని నిరుపేద ఖైదీలు బెయిలు పొందడానికి, కేసు విచారణ త్వరగా జరగడానికి అవసరమైన న్యాయ సహాయం ఉచితంగా అందించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. జైలులో ఖైదీలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో జైలు సీజేఎం న్యాయమూర్తి ప్రదీప్‌కుమార్, డీఎల్ఎస్ఏ న్యాయవాదులు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, రమేష్, కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, డీఎస్పీ కమలాకర్, జైలు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

2న ఖాదీ సంత

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు ఖాదీ సంత ఏర్పాటుకు చేయాల్సిన ఏర్పాట్లపై మాజీ ఎమ్మెల్సీ వి.వి.ఎన్.మాధవ్, భాజపా జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర చర్చించారు. లాసన్స్ బేకాలనీ భాజపా కార్యాలయంలో శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. భాజపా రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, భాజపా నాయకులు ప్రకాష్‌రెడ్డి, విజయానందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతి గృహాల నిర్వహణపై వీసీ సమీక్ష

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం వసతి గృహాలు, తరగతుల నిర్వహణ తదితర అంశాలపై ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు ప్రిన్సిపల్‌లు, డీన్‌లు, విభాగాధిపతులు, ఇతర అధికారులతో శనివారం సమీక్షించారు. వసతిగృహాల్లో అందించే భోజన నాణ్యత విషయంలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. ఉద్యోగుల హాజరుకు సంబంధించి నూతనంగా అమలు చేస్తున్న ముఖగుర్తింపు విధానాన్ని అన్ని విభాగాలకు అమలు చేయాలని ప్రిన్సిపల్‌లు కోరారు. ఆకస్మిక తనిఖీలు చేపడుతున్న విధానంపై అధికారుల నుంచి సూచనలు స్వీకరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



వివిధ విభాగాల అధికారులతో మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: భాద్రపద బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. 11వ వార్డు పరిధి టీఐసీ పాయింట్ సమీపంలోని కొండ మీద ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు, తులసీదళ అర్చనలు జరిగాయి. నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, శ్రీనివాస్ దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

తైక్వాండో క్రీడాకారుల ఎంపికలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఈనెల 30, అక్టోబర్ 1వ తేదీన విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అండర్-14, అండర్-17 బాల బాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తైక్వాండో పోటీల ఎంపికలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.దేముడు తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతాయన్నారు. అర్హత కలిగిన విద్యార్థులను తీసుకుని రావాలని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

ఆరిలోవ, న్యూస్‌టుడే : తోటగరువు ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గం స్థాయి అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు ఆటల పోటీలను 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ప్రారంభించారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) వారి ఆధ్వర్యంలో ఆటలు పోటీలు జరుగుతున్నాయి. తూర్పు నియోజకవర్గంలో ఉన్న 8 పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని పాఠశాల పి.డి. వి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్.ఎం. టి.రామకృష్ణారావు, ఉపాధ్యాయులు, పి.డి.లు వి.శ్రీనివాసరావు, ఎ.సి.బి.నాయుడు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

హెచ్‌బీకాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: యువత సర్దార్ భగత్‌సింగ్‌ని ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదిర్శ మధురెడ్డి అన్నారు. శనివారం 15వ వార్డు పరిధి హెచ్‌బీకాలనీ చివరి బస్‌స్టాప్ వద్ద అఖిల భారత యువజన సమాఖ్య, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాలు, హరీష్, రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

కూరగాయలు కొనలేము.. తినలేము..



కంచరపాలెం, న్యూస్‌టుడే: కూరగాయల రేట్లు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. వినియోగదారులు కొనలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం కంచరపాలెం రైతుబజారులో ఉల్లిపాయలు కిలో రూ.54లు, టమాటా కిలో రూ.44లు, వంకాయలు కిలో రూ.50లు ధరలు పలికాయి. టమాటా, ఉల్లి ప్రతి కూరలోను ఉండడం, వాటి రేట్లు తగ్గుముఖం పట్టక పోవడంతో రైతు బజారుకొచ్చేవారు ఇవేమి రేట్లంటూ లబోదిబో మంటున్నారు. పోని బయట కొనుక్కొందామంటే అదనంగా మరో పది రూపాయలు వదిలిపోతుందంటున్నారు. పెరిగిన రేట్లను తగ్గించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మేముసాన్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

విశాఖ ఉత్తరం: 80747 24699
విశాఖ దక్షిణం: 80085 66543

మురళీనగర్, న్యూస్‌టుడే

సమస్య: సెక్టార్-11 బిర్లాకూడలి సమీపంలో పలుచోట్ల సేవా రహదారిలో రోడ్డు గతుకుల మయంగా మారింది. ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - శశిభూషణ్, సింగరాయమెట్ట

సమాధానం: ఈ పనులకు సంబంధించి త్వరలోనే మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. - సతీష్, 50వ వార్డు ఏఈ

ఎట్టకేలకు చెత్త తరలింపు

కార్పొరేషన్, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

పాతనగరం టౌన్‌కొత్త రోడ్డు చెత్త తరలింపు కేంద్రం నుంచి శనివారం భారీగా వ్యర్థాలను తరలించారు. స్థానికులు 'ఈనాడు మేముసాన్నాం.. మీకు తోడుగా' దృష్టికి ఈ సమస్యను తీసుకొచ్చారు. దీనిపై శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ చర్యలు తీసుకున్నారు. ఇకపై ఎప్పటికప్పుడు చెత్తను తరలిస్తామని కేంద్రం నిర్వాహకులు తెలిపారు.

20ఏ సర్వీసు నిలిపివేతతో ఇక్కట్లు


గురుద్వారా, న్యూస్‌టుడే

మద్దిలపాలెం నుంచి పాత పోస్టాఫీస్‌ వెళ్లే 20ఏ బస్సు సర్వీసును నిలిపివేయడంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ మార్గంలో బస్సును నడపటంతో హెచ్‌బీ కాలనీ, కేఆర్‌ఎం కాలనీ, సీతమ్మధార, కొండవాలు ప్రాంతం, నక్కవానిపాలెం, సీతంపేట ప్రజల ప్రయాణానికి ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ ఎంవీపీ, సీతమ్మధార, గురుద్వారా, సీతంపేట, కాంప్లెక్స్‌, జగదాంబ, పూర్ణామార్కెట్‌, కొత్త రోడ్డు, పాతపోస్టాఫీస్‌ మార్గంలో ఆర్టీసీ యాజమాన్యం అద్దె బస్సుతో రవాణా సౌకర్యం కల్పించింది. వారితో ఒప్పందం పూర్తికావడంతో కొన్నేళ్ల నుంచి ఆ సౌకర్యాన్ని రద్దు చేశారు. సాధారణంగా బస్సు నడిచే సమయంలో రోజుకి వందలామంది ప్రజలు ప్రయాణాలు సాగించేవారు. ఒకరికి ఒక వైపు సుమారు రూ.10 నుంచి రూ.12 వరకు టికెట్‌ ఖర్చు అయ్యేది. ప్రస్తుతం రద్దుచేయడంతో ప్రయాణికులు ఆటోల్ని ఆశ్రయించక తప్పడం లేదు. దీంతో వారికి గిరాకీ పెరిగింది. బస్సు ఉన్నపుడు టికెట్‌ ధరపై రెండు, మూడు రూపాయలు అదనంగా తీసుకునే ఆటోడ్రైవర్లు ఆ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇష్టానుసారంగా ఛార్జీలను పెంచేస్తున్నారు. దీంతో కళాశాల విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు, కార్మికులపై తీవ్ర భారం పడుతోంది. ప్రయాణికుల మాట పక్కన పెడితే ఈ సర్వీసు ద్వారా ఆర్టీసీకి ఆదాయం మెండుగా ఉండేది. అలాంటి సర్వీసును రద్దు చేయడంతో ఇటు ప్రయాణికులతోపాటు అటు ఆర్టీసీ ఆదాయానికి గండి పడినట్లే అయ్యింది. ఏ సమయంలోనైనా బస్సులో ప్రయాణించడం సురక్షితమని భావించే కొంతమంది వృద్ధులు, మహిళలు ఒంటరిగా ఆటోలు ఎక్కేందుకు సంకోచిస్తున్నారు. వందలాది మంది ప్రజలకి వెసులుబాటుగా ఉండే బస్సు సర్వీస్‌ను ఎలాంటి ప్రకటన చేయకుండా ఆపేయడంతో ఇక్కట్లకు గురవుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకొని సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు.



ఆటో కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లా..



20ఏ బస్సు సర్వీస్‌ను రోజూ వందలాది మంది ప్రయాణికులు వినియోగించుకునేవారు. హెచ్‌బీ కాలనీ మొదలుకొని పాత పోస్టాఫీస్‌ వరకు ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో ఎంతోమందికి సౌకర్యవంతంగా ఉండేది. ప్రజలకు అందుబాటులో ఉండే బస్సును చెప్పాపెట్టకుండా నిలిపేశారు. ఈ సమస్యను ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు దృష్టికి తీసుకెళ్లా. పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

– నరవ ప్రకాశరావు (హెచ్‌బీ కాలనీ వాస్తవ్యుడు)

ఛార్జీల భారం

బస్సు లేకపోవడంతో ఆటో ఛార్జీలు భారంగా మారాయి. దానికి తోడు కళాశాల నుంచి వచ్చేప్పుడు నిరీక్షణ తప్పడం లేదు. బస్సు ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. బస్సు నిలిపివేతతో ఇబ్బందులు పడుతున్నాం. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

– రమేశ్‌ (విద్యార్థి)

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి



బస్సు సర్వీస్‌ను నిలుపుదల చేయడం అన్యాయం. గతంలో సమీప ప్రాంతాల ప్రజలు ప్రయాణాలు చేయడానికి అనువుగా ఉండేది. దీనిపై సీపీఎం పార్టీ తరపున అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ బస్సు లేకపోవడంతో కార్మికులు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులపై తీవ్రభారం పడుతోంది. తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్‌ చేస్తున్నాం.

– వి.కృష్ణారావు, సీపీఐ(ఎం) మద్దిలపాలెం జోన్‌ కార్యదర్శి

సామాజిక చైతన్య వారధులుగా విద్యార్థులు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టర్-13 జీవీఎంసీ ఉన్నత పాఠశాల (మాధవధార)లో శనివారం ఉదయం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమానికి అందరం కట్టుబడి ఉండాలని, ప్రభుత్వ సూచనలు ఆచరణలో పెట్టాలనే నినాదంతో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి. హేమలత మాట్లాడుతూ ప్లాస్టిక్‌ వాడకం నివారించి పరిసరాల పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా సమాజంలో అందరి ఆరోగ్యం బాగుండాలనే ధ్యేయంతో విద్యార్థులు సామాజిక చైతన్య వారధులుగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రవాణా సేవలు ప్రైవేటుపరం చేయవద్దంటూ నిరసన

మాధవధార, న్యూస్‌టుడే: రవాణా సేవలను ప్రైవేటు పరం చేయవద్దని కోరుతూ మోటార్‌ ట్రాన్స్‌పోర్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో శనివారం రవాణా కార్యాలయంలో నిరసన తెలియజేశారు. ప్రస్తుతం లైసెన్సులు, ఫిట్‌నెస్‌, ఇతర సేవలన్నీ రవాణా శాఖ నుంచి ఆన్‌లైన్‌ ద్వారా చేస్తున్నారని, ఇవే ప్రైవేటు పరం చేస్తే వారిని నియంత్రించే పరిస్థితి ఉండదని యూనియన్‌ ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు పేర్కొన్నారు. మరో వైపు ఇప్పటికే విపరీతమైన అదనపు రుసులు వసూలు చేస్తూ మోటారు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇక ప్రైవేటు పరం చేయడం వల్ల ఆటో మోటార్‌ కార్మికులు దోపిడీకి గురవుతారన్నారు. తక్షణమే ఆర్టీవో సేవలు ప్రైవేటు పరం కాకుండా అడ్డుకోవాలని డిమాండ్‌ చేశారు. అనంతరం ఆర్టీవో దేవికి తమ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు జి.రాజ్‌కుమార్‌, రాము, గౌరిసు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.



రవాణా కార్యాలయంలో నిరసన తెలియచేస్తున్న కార్మికులు

30న జీవీఎంసీ కార్మికుల మహాధర్నా

మాధవధార, న్యూస్‌టుడే: ఒప్పంద, పొరుగు సేవల కార్మికుల్ని క్రమబద్ధీకరించడం, కనీస వేతనాలు అమలు చేయాలని, ఇతర పెండింగ్‌ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 30న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా చేపట్టనున్నామని సీఐటీయూ జోన్‌ నాయకుడు ఎస్‌.శ్రావణ్‌ కుమార్‌ అన్నారు. శనివారం ఉదయం 49, 50, 51వ వార్డులకు చెందిన కార్మికుల ఆధ్వర్యంలో శానిటేషన్‌ కార్యాలయం వద్ద గోడ పత్రికను ఆవిష్కరించి, నిరసన చేపట్టారు. జీవీఎంసీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బంగారయ్య, ధనలక్ష్మి, రమణ పాల్గొన్నారు.



50వ వార్డు పారిశుద్ధ్య కార్యాలయంలో నిరసన తెలియజేస్తున్న సిటూ సభ్యులు, కార్మికులు

సంపూర్ణ పోషకాహారంతో రక్తహీనత నివారణ



కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు

మాధవధార: పోషకాహారంతో రక్తహీనత నివారణ సాధ్యమని, ఎంతో మేలు జరుగుతుందని జిల్లా మహిళ శిశుసంక్షేమశాఖ పీడీ జి.జయదేవి పేర్కొన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ వద్ద ఉన్న అర్బన్‌ ఐసీడీఎస్‌ కార్యాలయంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాలలో ఆమె పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల ఆరోగ్యాల మెరుగుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పోషకాహారాన్ని లబ్ధిదారులు విధిగా తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఆరు మాసాలు నిండిన పిల్లలకు సీడీపీఓ ఎం.వి.రమణికుమారి ఆధ్వర్యంలో అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు మాజీ కార్పొరేటర్‌ పి.నర్సకుమారి, శ్యామలదీపిక, తెదేపా నాయకుడు పి.శ్రీనివాసరావు, సహాయ సీడీపీఓ శ్రీలత, సూపర్‌వైజర్‌ జ్యోతి, పలువురు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వేగం వద్దు.. ప్రాణం ముద్దు..!

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఈ మధ్య కాలంలో నగరంలో ఎక్కడా చూసినా రోడ్డు ప్రమాదాలు జరుగుతూ చాలామంది యువత ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో వేగం కన్నా.. ప్రాణం మిన్న.. వేగం వద్దు.. ప్రాణం ముద్దు.. అంటూ విశ్రాంత ఉపాధ్యాయుడు ప్లకార్డులు చేతబట్టి వివిధ కూడళ్లు, జాతీయ రహదారుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సామాజిక సేవలో భాగంగా ఎన్‌.ఎ.డి. ప్రాంతానికి చెందిన పదవీ విరమణ చేసిన ఇంటూరి భూషణం శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శరీరానికి ఫ్లెక్సీ చొక్కా మాదిరిగా వేసుకుని చేతిలో 'స్పీడ్‌ థ్రిల్స్‌.. బట్‌ కిల్స్‌' అనే ప్లకార్డును పట్టుకుని వాహన చోదకులకు అవగాహన కల్పించారు.



అక్కయ్యపాలెం జాతీయ రహదారిలో ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ఇంటూరి భూషణం

మహాకవి గుర్రం జాషువా జయంతి

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : యాభై అయిదో వార్డు జాషువానగర్‌లో శనివారం మహాకవి గుర్రం జాషువా 129 జయంతి ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, ఎస్సీ నాయకులు కొప్పుల వెంకటరావు, భాజపా నాయకులు సునీల్‌ అగర్వాల్‌, జనసేన ఉత్తర నియోజవర్గం సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్‌, వార్డు కార్పొరేటర్‌ శశికళ, గ్రామ పెద్దలు గొటివాడ నర్సింగరావు, గుమ్మిడి ఆదినారాయణ, అలమండ ప్రసాద్‌ పాల్గొని జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గుర్రం జాషువా విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

లలితాపీఠంలో 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: లలితానగర్‌లోని లలితా పీఠంలో సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి ఆశీస్సులతో వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు దేవీశరవన్నరాత్రి మహోత్సవాలు జరుగుతాయని పీఠం మేనేజర్‌ మన్నవ కృష్ణసేన్‌ తెలిపారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం పీఠం దర్బార్‌ హాలులో కరపత్రాల్ని ఆవిష్కరించారు. ప్రతిరోజూ అమ్మవారికి పంచామృతాభిషేకం, బాలభోగం నివేదన, చండీ పారాయణ, శ్రీచక్రనవావరణార్చన, కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. 3వ తేదీ గురువారం అమ్మవారి సన్నిధిలో కలశస్థాపన, కుంకుమార్చన జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అవసరాల శ్రీనివాసరావు, ఎ.ఆర్‌.వి.డి.ప్రసాద్‌, వెంకటేశ్వరి, ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.



పీఠం దర్బార్‌ హాలులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మన్నవ కృష్ణసేన్‌, అవసరాల శ్రీనివాసరావు తదితరులు

5922 మంది డ్రైవింగ్‌ లైసెన్సుల తాత్కాలిక రద్దు

మాధవధార, న్యూస్‌టుడే: శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనం నడపడంతో పాటు, వెనుక కూర్చొన్న వ్యక్తులకు కూడా శిరస్త్రాణం లేకపోవడంతో 5922 మంది చోదకుల లైసెన్సులను మూడు నెలల పాటు తాత్కాలికంగా రద్దు చేసినట్లుగా రవాణాశాఖ డీటీఓ జి.సి.రాజారత్నం తెలియజేశారు. ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న 6625 మంది చోదకులపై ట్రాఫిక్‌ పోలీసులు కేసులు నమోదు చేయగా, వారిలో 5922 మంది లైసెన్సులను మూడు నెలల పాటు తాత్కాలికంగా రద్దు చేసినట్లుగా తెలియజేశారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 2న భారీ ర్యాలీ

సీతంపేట, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబర్‌ 2న జరిగే భారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్‌ వి.వి.రమణమూర్తి పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల నాయకులతో కలిసి శనివారం విశాఖ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రజా ఉద్యమ ర్యాలీకి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయడానికి దూకుడు పెంచుతున్న సమయంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాలు ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. డాబా గార్డెన్స్‌లోని అంబేడ్కర్‌ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో ఐ.ఎఫ్‌.టి.యూ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, మేడా మస్తాన్‌ రెడ్డి, పీఓడబ్ల్యు ఎం.లక్ష్మి, వై.నూకరాజు, జె.రవి(భారత నాస్తిక సంఘం), కె.ఎస్‌.చలం(న్యాయవాదుల సంఘం), కె.పద్మ(మహిళ చేతన), సూర్య ప్రకాష్‌, రవి తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆశ్రయ కేంద్రంతో శ్రద్ధా ఫౌండేషన్‌ ఒప్పందం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: టీఎస్సార్‌ కాంప్లెక్స్‌లోని ఆశ్రయ కేంద్రం నిర్వాహకులతో శ్రద్ధా ఫౌండేషన్‌ ప్రతినిధులు ఒప్పందం చేసుకున్నారు. నగరంలోని రహదార్లపై ఉంటున్న మానసిక దివ్యాంగులను ఆసుపత్రిలో చేర్చడం, చికిత్స అనంతరం ఇళ్లకు పంపించే కార్యక్రమాలను శ్రద్ధా ఫౌండేషన్‌ చూస్తుంది. ఫౌండేషన్‌ ప్రతినిధి భరత్‌ పట్వాని, ఆశ్రయ నిర్వాహకుడు ప్రగడ వాసు శనివారం ఒప్పందం కుదుర్చుకున్నారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్‌ స్వరాలి, శ్రావణి, గౌతం, హరీష్‌ తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రయ కేంద్రం నిర్వాహకులతో ఒప్పందం చేసుకుంటున్న సంస్థ ప్రతినిధులు

పడకేసిన ఇంటింటి చెత్త సేకరణ

★ క్షేత్రస్థాయిలో కనిపించని కార్మికులు

★ ప్రజల నుంచి పెరుగుతున్న ఫిర్యాదులు



క్లాప్‌ వాహనంలోకి చెత్తను వేస్తున్న కార్మికులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఉత్తర, దక్షిణం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. అపార్టుమెంట్ల వద్ద రోజుల తరబడి వ్యర్థాలు నిల్వలు ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు విజయవాడ వరద సహాయ కార్యక్రమాలలో పాల్గొని తిరిగి వచ్చిన తరువాత రెండు నియోజకవర్గాలలో చెత్తను తీసుకెళ్లడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. గత పది రోజుల్లో జీవీఎంసీకి 59 ఫిర్యాదులు రావడం గమనార్హం. చాలా ప్రాంతాలలో క్లాప్‌ వాహనాలు తిరగడం లేదని, విద్యుత్తు ఆటోలు సైతం కనిపించడంలేదని స్థానికులు చెబుతున్నారు. గతంలో రెండు ట్రిప్పులు తిరిగే క్లాప్‌ వాహనం ఇప్పుడు ఒక ట్రిప్పు తిరుగుతోందని, ఒక్కోరోజు అసలు రావడంలేదని అక్కయ్యపాలెంకు చెందిన రమణయ్య తెలిపారు.

★ జీవీఎంసీ ప్రజారోగ్య విభాగంలో 5340 మంది సిబ్బంది పనిచేస్తుండగా అందులో 5140 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. మరో 600 మంది క్లాప్‌ వాహనాలతోపాటు వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. వీరు కాకుండా ప్రతి నెలా కూలి ప్రాతిపదికన 1500 మంది కార్మికులతో పనిచేయిస్తున్నట్లు అధికారులు బిల్లులు పెడుతున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సహాయ వైద్యాధికారులు ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తూ నిధులు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కార్మికుడు విధులకు రాకపోయినా వచ్చినట్లు దస్త్రాల్లో నమోదు చేసి నిధులు మింగేస్తున్నారని సమాచారం.



ఎన్‌జీజీఓస్‌ కాలనీలోని ఓ అపార్టుమెంటు వద్ద పేరుకుపోయిన చెత్త


★ ఏ సమయంలో ఎంత మంది కూలీలు కావాలన్నా సరఫరా చేసే సామర్థ్యం ఏజెన్సీకి ఉందా అని కనీస విచారణ చేయకుండా ఉన్నతాధికారులు సైతం దస్త్రాలకు ఆమోదం తెలుపుతున్నారు. స్థాయీ సంఘం సభ్యులు కూలి కార్మికులకు ఆమోదం తెలుపుతుండగా, కౌన్సిల్‌ సమావేశంలో కార్పొరేటర్లు తమ వార్డులో కార్మికులు కనిపించడంలేదని చెబుతుండటం అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికైనా క్లాప్‌ గుత్తేదారుతో అధికారులు చర్చలు జరిపి ఇంటింటి నుంచి సక్రమంగా చెత్తను సేకరించేలా ఆదేశాలు జారీ చేయాలని, కార్మికులంతా విధులకు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు శాప్‌ ఎండీ గిరీషా రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్‌) ఎండీ, వైస్‌ ఛైర్మన్‌ గిరీషా ఆదివారం విశాఖ రానున్నారు. ఆరోజు ఉదయం 6గంటలకు గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో నగరానికి చేరుకొని అతిథి గృహంలో బసచేస్తారు. నగరంలో జరగనున్న పారా షూటింగ్‌, ఈత ఛాంపియన్‌షిప్‌ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు.

పోటీలతో వెలుగులోకి విద్యార్థుల ప్రతిభ

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలపై పట్టు సాధిస్తే దేశంలో ఎక్కడైనా మనుగడ సాగించవచ్చని సెయింట్‌ జోసెఫ్‌ మహిళా కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ సిస్టర్‌ షైజీ అన్నారు. కళాశాల ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో శనివారం అంతర కళాశాలల ప్రతిభా పోటీలు నిర్వహించారు. సిస్టర్‌ షైజీ మాట్లాడుతూ వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులను ఒక్క వేదికపై తీసుకొచ్చి పోటీలను నిర్వహించడం ద్వారా వారిలోని ప్రతిభను వెలికి తీసినట్లయిందన్నారు. అనంతరం కళాశాల హిందీ విభాగాధిపతి పి.కె.జయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు ఎ.వి.ఎన్‌. కళాశాల ప్రిన్సిపల్‌ సింహాద్రినాయుడు చేతుల మీదుగా జ్ఞాపికలు, ధ్రువీకరణపత్రాలు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నిర్మల, దీప్తి, కోటేశ్వరరావు, పి.కె.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

గురువు దైవంతో సమానం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకోవాలని భారత్‌ వికాస్‌ పరిషత్‌(బీవీపీ) అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు అన్నారు. ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీర్స్‌ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం బీవీపీ ఆధ్వర్యంలో గురు వందన్‌ ఛత్రాభినందన్‌ కార్యక్రమం నిర్వహించారు. ఏయూ పూర్వ రిజిస్ట్రార్‌ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గురువు దైవంతో సమానమన్నారు. విద్యార్థులను ఆకట్టుకునేలా బోధిస్తున్న ప్రేమ పాఠశాల ఉపాధ్యాయిని శ్యామలను సత్కరించారు. బీవీపీ ప్రతినిధులు రమేష్‌ చంద్‌ జైన్‌, ఎంవీ రాజశేఖర్‌, ఎంఎస్‌ఎల్‌ శైలజ, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శ్యామలను సత్కరిస్తున్న భారత్‌ వికాస్‌ పరిషత్‌ ప్రతినిధులు

వ్యర్థాల పునర్వినియోగంపై పోటీలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వ్యర్థాలతో కళాత్మక వస్తువుల తయారీపై పోటీ కార్యక్రమాన్ని శనివారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపల్‌ ఆర్‌.మంజుల మాట్లాడుతూ వ్యర్థాల పునర్వినియోగం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. దీనిపై కళాశాల ఎన్‌సీసీ విద్యార్థినులకు పోటీలు నిర్వహించామన్నారు. పర్యావరణ పరిరక్షణతోపాటు, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే దీని లక్ష్యమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్‌ డాక్టర్‌ కె.గీతాంజలి, కళాశాల కోఆర్డినేటర్‌ బి.సంతోషి అనూష, వైస్‌ ప్రిన్సిపల్‌ వై.లక్ష్మి, ఫిజికల్‌ డైరెక్టర్‌ ఆర్‌.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

భగత్‌సింగ్‌ స్ఫూర్తితో ఉక్కు పరిరక్షణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: భగత్‌సింగ్‌ స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిరక్షణకు పోరాటాలు చేయాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్‌ కోరారు. శనివారం జగదాంబ సీఐటీయూ కార్యాలయంలో భగత్‌సింగ్‌ జయంతిని నిర్వహించారు. సీఐటీయూ నాయకులు భగత్‌సింగ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉక్కును నిర్వీర్యం చేయడానికి ఒప్పంద కార్మికులను తొలగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఉపాధ్యక్షులు వై.రాజు, పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఏవీఎన్‌ కళాశాలలో..

వన్‌టౌన్, న్యూస్‌టుడే: దిశ విద్యార్థి సంఘం, నవజవాన్‌ భారత్‌ సభ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఏవీఎన్‌ కళాశాలలో భగత్‌సింగ్‌ జయంతి నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. దిశ విద్యార్థి సంఘం సెంట్రల్‌ కౌన్సిల్‌ సభ్యులు అవినాష్‌, ఏవీఎన్‌ కళాశాల ప్రిన్సిపల్‌ సింహాద్రి నాయుడు, నవజవాన్‌ భారత్‌ సభ ప్రతినిధులు సుజన్‌, అజయ్‌ తదితరులు మాట్లాడారు.



ధ్రువీకరణ పత్రాలతో విజేతలు

దేవాదాయశాఖ ఏసీగా అన్నపూర్ణ బాధ్యతల స్వీకరణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ)గా టి.అన్నపూర్ణ శనివారం ఉదయం టర్నర్‌చౌల్ట్రీ ఆవరణలోని ఏసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా ఏసీగా పనిచేస్తూ బదిలీపై ఆమె విశాఖ వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శిరీషను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. 1991లో దేవాదాయశాఖలో జూనియర్ సహాయకురాలిగా చేరిన ఆమె అంచెలంచెలుగా ఉద్యోగోన్నతులు పొందుతూ 2019లో సహాయ కమిషనర్ స్థాయికి ఎదిగారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల సహాయ కమిషనర్‌గా పనిచేశారు. విజయనగరం పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓగా బాధ్యతలు నిర్వహించారు. విశాఖ ఏసీగా బాధ్యతలు చేపట్టిన అన్నపూర్ణను నగరంలోని వివిధ ఆలయాల ఈఓలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆలయాల నిర్వహణ, భక్తులకు సౌకర్యాల కల్పన, ఆస్తులు, భూముల పరిరక్షణపై దృష్టి సారిస్తామని, ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తామని అన్నపూర్ణ తెలిపారు.


అన్నపూర్ణను అభినందిస్తున్న వివిధ ఆలయాల ఈఓలు

శిక్షణ ఐపీఎస్‌ల బృందం పోర్టు సందర్శన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: భారత్ దర్శన్‌లో భాగంగా నార్త్ ఈస్టర్న్ పోలీస్ అకాడమీ డిప్యూటీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనేమిచంద్‌బాజియా ఆధ్వర్యంలో 15 మంది శిక్షణ ఐపీఎస్‌ల బృందం శనివారం విశాఖ పోర్టును సందర్శించింది. పోర్టు అధికారులు ఈ బృందానికి సాదరంగా స్వాగతం పలికారు. పోర్టులో జరుగుతున్న వివిధ కార్యక్రమాలు, ఎగుమతులు, దిగుమతులు, వ్యాపార అవకాశాలు వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పోర్టు ఇచ్చిన ఆతిథ్యానికి ఈ బృందం ధన్యవాదాలు తెలిపిందని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు.


పోర్టు ఆవరణలోని మస్టర్ స్టేషన్ వద్ద శిక్షణ ఐపీఎస్‌ల బృందం

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

'హక్కుల్ని హరిస్తే సహించం'

'టెట్'కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో అక్టోబరు 3 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏడు కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలో ఒక కేంద్రం కలుపుకొని 8 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. వీటికి ప్రత్యేక అధికారులు, స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 60,574 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఫొటో లేని హాల్ టికెట్‌తో వచ్చే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల వద్ద ఫొటోతో కూడిన గుర్తింపు పత్రం, తాజా ఫొటోను పరిశీలించి అనుమతించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన దివ్యాంగుల కోసం అదనంగా 50 నిమిషాల సమయం కేటాయించినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణలో అనుమానాల నివృత్తికి ఉదయం 7.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు కమాండ్ కంట్రోలు రూమ్ పనిచేస్తుందని వివరించారు. డీఈఓ చంద్రకళ, ఎస్ఎస్ఏ ఏపీసీ బి.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్. చిత్రంలో డీఈఓ చంద్రకళ

రైల్వే పరిసరాల్లో పరిశుభ్రతపై అవగాహన

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా వాల్తేర్ రైల్వే సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శనివారం పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రైళ్లతో పాటు స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాటకాలు ప్రదర్శించారు. రైల్వే స్టేషన్ల పరిసరాల్లో పరిశుభ్రతను నెలకొల్పే లక్ష్యంతో వాల్తేరు రైల్వే ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు 15 రోజులపాటు స్వచ్ఛభారత్ అభియాన్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా విజయనగరం, శ్రీకాకుళం రోడ్, రాయగడ, కొరాపుట్, జగదల్‌పూర్, కిరండూల్, అరకు, సింహాచలం, దువ్వాడ స్టేషన్ల వద్ద స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించినట్లు వాల్తేరు అధికారులు తెలిపారు.


నాటకం ప్రదర్శిస్తున్న వాల్తేర్ సాంస్కృతిక విభాగ సభ్యులు

'మహాత్మా గాంధీ ఆసుపత్రికి ప్రపంచస్థాయి పురస్కారం'

ఈనాడు డిజిటల్, విశాఖపట్నం: విశాఖలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌కు ప్రపంచస్థాయి పురస్కారం లభించినట్లు సంస్థ ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నగరంలోని వివిధ ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు తదితరుల సహకారంతో అనేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాం. 'క్లోజ్ ది కేర్ గ్యాప్' నినాదంతో క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం, వ్యాధిని ముందుగా గుర్తించడం, మెరుగైన సంరక్షణ పద్ధతులు తదితరాలు మంచి ప్రభావం చూపాయి. దీనికిగాను ఆసుపత్రికి యూనియన్ ఆఫ్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ (యూఐసీసీ) ప్రపంచంలోనే మూడో సంస్థగా గుర్తించింది. ప్రపంచ క్యాన్సర్ కాంగ్రెస్ సందర్భంగా ఇటీవల జెనీవాలో జరిగిన సదస్సులో ఈ అంశాన్ని ప్రకటించింది. ఆసియాలో ఇలాంటి గుర్తింపు పొందిన ఏకైక సంస్థగా మా ఆసుపత్రి నిలిచింది. రాబోయే రోజుల్లో 'బ్లడ్ డిజార్డర్స్' కోసం రాష్ట్రంలోనే తొలి సంస్థను ఏర్పాటుచేస్తాం' అని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ ఎం.మురళీకృష్ణ

3 నుంచి దుర్గాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: పూర్ణమార్కెట్ దరి వెలంపేట దుర్గాలమ్మ దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ...


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

11.4 కిలోల గంజాయి స్వాధీనం


రైల్వే పోలీసుల అదుపులో నిందితులు

ఊడిపడిన ఐసీడీఎస్ కార్యాలయ సీలింగ్


ఊడిపడిన సీలింగ్

చికెన్ ధరలు

(కిలో-రూ.)	[illegible]	[illegible]
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్డ్	187	206
స్కిన్‌లెస్	213	216

గాజువాక
• గాజువాక • విశాఖ పశ్చిమం

స్వచ్ఛ పురస్కారాల ప్రదానం

ఉక్కునగరం(స్టీల్‌సెక్టార్-3), న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారంలోని వివిధ విభాగాలకు శనివారం స్వచ్ఛ పురస్కారాలు-2024 ప్రదానం చేశారు. ఉక్కు ఈడీ(వర్క్స్) ప్రధాన సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి సీజీఎం ఇన్‌ఛార్జి ఎం. శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్లాస్ట్‌ఫర్నేస్, కోక్‌ఓవెన్, కోల్ కెమికల్ ప్లాంట్, ఎల్ఎంఎంఎం, ఆర్ఎంహెచ్‌పీ, ఎస్ఎంఎస్-2, సింటర్ ప్లాంట్, డబ్ల్యుఆర్ఎం, ల్యాబొరేటరీ, ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రి, ఎవీఎండీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, స్ట్రక్చరల్ అండ్ సాల్వేజ్, ట్రాఫిక్, మెడికల్, ఉక్కునగరం పరిపాలన విభాగాలకు పురస్కారాలు అందించారు.


పురస్కారాలు అందుకున్న మెడికల్ విభాగం అధికారులు

సన్యాసిరావు లేని లోటు తీరనిది : సిటూ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ప్రజా నాట్యమండలి ద్వారా ఎన్నో చైతన్య కార్యక్రమాలు నిర్వహించిన కళాకారుడు జి.సన్యాసిరావు లేని లోటు పూడ్చలేనిదని సిటూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.నర్సింగరావు అన్నారు. గాజువాక లయన్స్ క్లబ్‌లో శనివారం సన్యాసిరావు సంతాప సభ నిర్వహించారు. సీపీఎం, సిటూ నాయకులు జగ్గునాయుడు, లోకనాథం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిటూ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు

ఆరోగ్యం.. ఆనందం..!

అంగన్‌వాడీల్లో 'పోషకాహార మాసోత్సవాలు' ప్రారంభం

-న్యూస్‌టుడే, సింధియా

మాతాశిశు మరణాలను అరికట్టేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీ చేసిన ఆరోగ్య సూత్రాలు అమలుకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన 'పోషణ్ అభియాన్' పథకం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్య ప్రదాయినిగా మారింది. విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధి ఐసీడీఎస్ (సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు మాసోత్సవాలు ప్రారంభించారు.

ములగాడ, గోపాలపట్నం మండలాల పరిధిలో అంగన్‌వాడీలు తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. తొలి రోజుల్లో బాల్వాడీలుగా ఉన్న సమయంలో ఓడీఏ నిధులతో విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ హయాంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సమీకృత ఆహారాన్ని అందించేవారు. ఆ తర్వాత ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఏర్పాటుతో పాటు, ఆయా కేంద్రాలను అంగన్‌వాడీలుగా మార్చి, విధులను విస్తరించారు.

సిబ్బంది విధులు ఇలా..

» అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా వార్డుల్లో ఏఎన్ఎంల సాయంతో కాలనీలు, గ్రామాల్లో పర్యటించి, అర్హులను గుర్తిస్తారు.

» గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారుల వివరాలు నమోదు చేస్తారు.

» వారికి కాలానుగుణంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, టీకాలు వేస్తూ, పోషకాహారాన్ని క్రమం తప్పకుండా అందిస్తుంటారు.

» 'ఆరోగ్యం- ఆహారం' వంటి అంశాలపై తరచూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తుంటారు.



ఇదీ లెక్క....

పశ్చిమంలో మొత్తం అంగన్‌వాడీలు	60
ములగాడలో : 27, గోపాలపట్నంలో	33
అద్దె భవనాల్లో ఉన్నవి	28
సొంత భవనాలు ఉన్నవి	23
సామాజిక భవనాలు, పాఠశాలల్లో ఉన్నవి	9
ఆరు నెలల్లోపు ఉన్న చిన్నారులు	825
మూడేళ్లలోపు బాలల సంఖ్య	5,411
ఆరేళ్లలోపు ఉన్న పిల్లలు	3,991
బాలింతలు	947
గర్భిణులు	1081

» కేంద్రాల సంఖ్య పెంచుతాం: పశ్చిమ నియోజకవర్గంలోని రెండు మండలాల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య పెంచడానికి ప్రత్యేక ప్రణాళికతో కార్యాచరణ ప్రారంభిస్తాం. అద్దె భవనాల స్థానే సొంత భవనాలు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. మాతా శిశు ఆరోగ్యం మెరుగునకు ప్రభుత్వం కృషి చేస్తుంది.



-పి.గణబాబు, పశ్చిమ ఎమ్మెల్యే

బీసీగేటు వద్ద కార్మికుల ఆందోళన

గాజువాక, న్యూస్‌టుడే : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 4వేల మంది ఒప్పంద కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం నిర్ణయించడంతో... శనివారం ఉదయం ఉక్కు బీసీగేటు వద్ద గందరగోళం చోటుచేసుకుంది. ఏ షిఫ్ట్, జనరల్ షిఫ్టులకు వెళ్లే కార్మికులంతా గేటు వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. భద్రత సిబ్బంది ప్రతి కార్మికుడిని పాస్ తనిఖీ చేసి, బయోమెట్రిక్ ప్రక్రియ ద్వారా లోపలకు పంపారు. చాలామందికి బయోమెట్రిక్ స్కాన్ కాకపోవడంతో గేటు బయటే నిలిచిపోయారు. వెంటనే తమను విధుల్లోకి అనుమతించాలని కార్మికులు నినాదాలు చేయడం, భద్రత సిబ్బంది అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. తర్వాత కాసేపటికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దల చొరవతో కేంద్ర ఉక్కు శాఖ నుంచి ఆదేశాలు రావడంతో కార్మికుల్ని లోపలకు అనుమతించారు. ఉక్కు కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిటూ) అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఒప్పంద కార్మికులకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.


గేటు బయట నిలిచిపోయిన కార్మికులు

స్థలాన్ని పరిరక్షించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే : షీలానగర్ కాలనీలో మిగులు స్థలాలను పరిరక్షించాలని కాలనీ అప్‌కీప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు శనివారం 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డిని కలిసి వినతి అందించారు. ఉద్యోగుల గృహ నిర్మాణానికి ఏళ్ల కిందట కొనుగోలు చేసిన భూమిలో మిగులు స్థలాన్ని కొందరు వ్యక్తులు నకిలీ ధ్రువపత్రాలతో ఇతరులకు విక్రయించారని, దీనిపై విచారణ చేయించాలని కోరారు. కాలనీ సంఘం కార్యదర్శి వై.సత్యవతి, సంయుక్త కార్యదర్శి కృష్ణమోహన్, సభ్యులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

?: గాజువాక వంటిల్లు శివాలయం నుంచి వుడా డబుల్‌రోడ్డు గోతులతో అధ్వానంగా ఉంది. -కేవీ.సూర్యం, అంబేడ్కర్‌కాలనీ

✔: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.. -అప్పారావు, ఈఈ.

?: జనావాసాల మధ్యలో ఉన్న స్వతంత్రనగర్ డంపింగ్ యార్డు నుంచి తీవ్రస్థాయిలో దుర్వాసన వెలువడుతుంది. జీవీఎంసీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. -రమేష్, గాంధీనగర్

✔: దుర్వాసన రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం. -డాక్టర్ కిరణ్‌కుమార్

అర్హులైన లబ్ధిదారులకు గృహాలు : జేడీ

గాజువాక, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆదేశాల ప్రకారంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా గృహ సదుపాయం కల్పిస్తామని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని జోనల్ కమిషనర్ బి.శేషాద్రి అన్నారు. శనివారం హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గాజువాక జోనల్ కార్యాలయంలో 'మన ఇల్లు.. మన గౌరవం..' పేరుతో లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాజువాక జోన్‌లో ఇప్పటి వరకు 19 వేల మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసి, ఇళ్లు దక్కని లబ్ధిదారులకు ఇప్పుడు న్యాయం చేస్తామన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ సత్యనారాయణ, డీఈ రామకృష్ణ, ఏఈ గోపాలకృష్ణ, జోన్-6 ఈఈ అప్పారావు, సిబ్బంది భాస్కరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో జేడీ శేషాద్రి, హౌసింగ్ ఈఈ సత్యనారాయణ


హాజరైన సిబ్బంది, లబ్ధిదారులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 62వ వార్డు మల్కాపురం ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. "మీ విజన్.. మా మిషన్" పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర@2047' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో మొత్తం 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి మాట్లాడుతూ... ఇదే అంశంపై ప్రభుత్వం విడుదల చేసిన 'క్యూ ఆర్' కోడ్ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపే వీలుంటుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : గాజువాక మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో శనివారం పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మండల విద్యాశాఖ అధికారి విశ్వనాథం, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


పర్యవేక్షిస్తున్న హెచ్ఎం అరుణకుమారి

కార్మికుల్ని యథాతథంగా కొనసాగించాలి

ఉక్కునగరం (స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారంలో ఒప్పంద కార్మికుల్ని యథాతథంగా కొనసాగిస్తూ, కార్మిక కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఉక్కు అఖిలపక్ష ఒప్పంద కార్మిక సంఘాల నాయకులు కోరారు. సుమారు 4వేల మంది కార్మికుల్ని తొలగించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే అంశంపై శనివారం సీజీఎం (హెచ్ఆర్) జి.గాంధీని కలిసి వినతిపత్రం అందించారు. పాత పద్ధతిలోనే కార్మికుల పాస్‌లు ఉంచాలని, బయోమెట్రిక్‌లో తొలగించిన పేర్లు పునరుద్ధరించాలని కోరారు. నాయకులు పి.వి.నగేష్, రవి, ఎన్.రమణ, వంశీకృష్ణ, కె.రాజు, డి.రామిరెడ్డి, యు.అప్పారావు పాల్గొన్నారు.


సీజీఎం గాంధీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

● **లతామంగేష్కర్ జయంతి**

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం దివంగత గాయని లతామంగేష్కర్ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపల్ సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

● **డ్రైవింగ్ లైసెన్సుల తాత్కాలిక రద్దు**

మాధవధార, న్యూస్‌టుడే: శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనం నడపడంతో పాటు, వెనుక కూర్చొన్న వ్యక్తులకు కూడా శిరస్త్రాణం లేకపోవడంతో 5922 మంది చోదకుల లైసెన్సులను మూడు నెలల పాటు తాత్కాలికంగా రద్దు చేసినట్లుగా రవాణాశాఖ డీటీఓ జి.సి.రాజారత్నం తెలియజేశారు. ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న 6625 మంది చోదకులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు.

● **వినతిపత్రం అందజేత**

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఇటీవల వర్షాలకు గాజువాక పట్టణంలో అధ్వానంగా తయారైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, లేళ్ల కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు వారు శనివారం జేడీ శేషాద్రిని కలిసి వినతిపత్రం అందించారు.

● **భగత్‌సింగ్‌కు నివాళి**

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : విప్లవవీరుడు భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం నెల్లిముక్కు తెదేపా కార్యాలయం వద్ద భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. నాయకులు పెంటయ్య, శ్రీరామ్మూర్తి, సాంబశివరావు, అప్పారావు పాల్గొన్నారు.

● **కార్మిక సంఘం బలోపేతంపై దృష్టి**

కరాస, న్యూస్‌టుడే : తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘం బలోపేతానికి సభ్యులంతా ఐక్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే గణబాబు సూచించారు. శనివారం కార్మిక సంఘం నాయకులు గోపాలపట్నం తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సంఘం సభ్యులు బీఎం.నాయుడు, మధుసూదనరావు, సురేష్, భవానీప్రసాద్, రామకృష్ణ, వెంకట్రావు, నాయుడుబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరాస, న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డులో రూ.19.35 లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. స్థానిక బుచ్చిరాజుపాలెం మెయిన్‌రోడ్డు నుంచి గాంధీనగర్ రైల్వే గెడ్డ వరకు సీసీరోడ్డు, కాలువ నిర్మాణ పనులకు నిధులు వినియోగిస్తామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారుకు సూచించారు. జీవీఎంసీ ఏఈ వెంకటలక్ష్మి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, తెదేపా నాయకులు, గాంధీనగర్ నివాసితుల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


శిలాఫలకం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రమణ, తదితరులు


పద్మశేఖరం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

సేవలు మరువలేనివి

గాజువాక, న్యూస్‌టుడే : జీవితంలో మనిషి చేసిన సేవలే చిరస్థాయిగా మిగులుతాయని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. శనివారం గాజువాక పంతులుగారి మేడ వద్ద శ్రీకృష్ణదేవరాయ కేటీబీ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సలాది పద్మశేఖరం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గణబాబు నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ సంస్థల విక్రయం సరికాదు'

ఉక్కునగరం (స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కు ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్)ను జపాన్ కంపెనీకి విక్రయించడం సరికాదని ఎఫ్ఎస్ఎన్ఎల్ విశాఖ స్టీల్‌ప్లాంట్ యూనిట్ గౌరవ అధ్యక్షులు మంత్రి రాజశేఖర్ అన్నారు. శనివారం కర్మాగారంలోని సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. తక్షణమే విక్రయ ఒప్పందాన్ని రద్దు చేసి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక నాయకులు పెద్దాడ రాములు, అమ్మినాయుడు, బి.సర్వేశ్వరరావు, జిలానీ, ధనరాజు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎఫ్ఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

అదృశ్యమైన వివాహిత ఆచూకీ లభ్యం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : అదృశ్యమైన వివాహిత ఆచూకీ కనిపెట్టిన ఘటనపై దువ్వాడ పోలీసులు శనివారం తెలిపిన వివరాలివి. కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్న వివాహిత ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన కోడలు అదృశ్యమైందని మామ 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాసరావు తమ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. వివాహిత చరవాణి సిగ్నల్ ఆధారంగా విజయవాడలో ఉన్నట్టు గుర్తించారు. ఆమెను అక్కడ నుంచి తీసుకొచ్చి భర్తకు అప్పగించారు. పోలీసు సిబ్బందిని సీఐ మల్లేశ్వరరావు అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అగనంపూడి, న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని 79వ వార్డు తెదేపా మహిళా అధ్యక్షురాలు జి.కనకభవానీ అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట శనివారం జాబిలీహిల్స్, అన్నపూర్ణనగర్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. వంద రోజుల పాలనపై, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. టి.రేవతి, సాయిలక్ష్మి, మంగ పాల్గొన్నారు.


కరపత్రాలు ప్రదర్శిస్తున్న మహిళలు

కోలాటాన్ని ఆదరించాలి

సింధియా, న్యూస్‌టుడే : సమాజంలో కోలాట కళను ప్రతి ఒక్కరూ ఆదరించాలని అగ్నికుల క్షత్రియ సంఘం నాయకుడు మాత వెంకటరమణ అన్నారు. శనివారం రాత్రి 58వ వార్డు గుల్లలపాలెం ఆలయం వద్ద శ్రీరాజేశ్వరి కోలాట నాట్యకళా సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోలాటంపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం మహిళలు కోలాటం పదర్శించారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 40వ వార్డు పశువుల ఆసుపత్రిలో శనివారం వైద్యాధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుక్కల్ని పెంచే యజమానులు విధిగా టీకాలు వేయించాలని, వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇదే అంశంపై తరచూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానిక కార్పొరేటర్లు నాగేశ్వరరావు, లక్ష్మణరావు, ఆసుపత్రి సిబ్బంది నారాయణమ్మ, అప్పలనాయుడు పాల్గొన్నారు.


పూడిక మట్టి తొలగించే..!

జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ ప్రధాన మురుగుగెడ్డలో పెద్ద మొత్తంలో పేరుకుపోయిన పూడికను శనివారం జేసీబీ సాయంతో తొలగించారు. మొత్తం రెండు లారీల పూడికమట్టిని తరలించామని వార్డు పారిశుద్ధ్య అధికారి నవరత్నం తెలిపారు. గెడ్డ పరిసరాల్లో నివాసం ఉండే వారంతా వ్యర్థాలను నేరుగా గెడ్డలో వేయడంతో భారీగా పూడిక పేరుకుపోతుందని, ఈ అంశంపై పలుమార్లు అవగాహన కల్పిస్తున్నా.. స్థానికులు పట్టించుకోవడం లేదన్నారు. తరచూ పూడిక పేరుకుపోవడంతో మురుగు స్తంభిస్తుందన్నారు. -న్యూస్‌టుడే, మల్కాపురం


జేసీబీతో పనులు చేస్తున్న సిబ్బంది

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

గాజువాక, అక్కిరెడ్డిపాలెం, అగనంపూడి, న్యూస్‌టుడే : ఏకాదశి సందర్భంగా శనివారం వుడాకాలనీ వినాయకనగర్‌లో కొలువైన ప్రసన్న వెంకటేశ్వరస్వామి, ఎస్టీబీఎల్ బాలాజీ, పెదగంట్యాడ వాంబేకాలనీ వైకుంఠ వెంకటేశ్వరస్వామి, అగనంపూడి పరిధి శాంతినగర్ శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక అర్చనలు నిర్వహించారు. అర్చకులు, ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఎస్టీబీఎల్‌లో..


గాజువాక వుడాకాలనీలో..


శాంతినగర్‌లో..

కాలనీల్లో దశమి రాటోత్సవాలు

సింధియా (నెహ్రూనగర్), న్యూస్‌టుడే : విజయదశమిని పురస్కరించుకుని శనివారం 58వ వార్డు కోడిపందాలదిబ్బలో రాట పూజలు చేశారు. వార్డు తెదేపా అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరావు, మహిళలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గాజువాక, న్యూస్‌టుడే : జీవీఎంసీ 65వ వార్డు బీసీరోడ్డులో నిర్వహించిన రాట పూజల్లో కార్పొరేటర్ ఇమ్రాన్, తెదేపా ఇన్‌ఛార్జి గోమాడ వాసు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు చిన్నా, కృష్ణ, శివ, త్రినాథ్, పవన్ కుమార్ పాల్గొన్నారు. పాతగాజువాక మెహర్‌నగర్‌లోనూ పూజలు చేశారు. కమిటీ సభ్యులు పొగిరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మెహర్‌నగర్‌లో..


58వ వార్డు కోడిపందాలదిబ్బలో..

యోగాతో గుర్తింపు

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాకకు చెందిన యోగా గురువు కొల్లి ఈశ్వరరావుకు నగరంలోని సెయింట్ పాల్స్ థియోలాజికల్ కళాశాల డాక్టరేట్ ప్రదానం చేసింది. శనివారం వుడాకాలనీలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మికవాదులు ఈశ్వరరావును సత్కరించారు. సభ్యులు వెంకటరాఘవాచార్యులు, వెంకట్రావు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం తగదు : వైకాపా

అక్కిరెడ్డిపాలెం, సింధియా, కరాస, న్యూస్‌టుడే : వైకాపా హయాంలో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారంటూ సీఎం చంద్రబాబునాయుడు అసత్య ప్రచారం చేయడం తగదని విశాఖ జిల్లా వైకాపా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో బీహెచ్‌పీవీ కూడలి ప్రసన్నగిరిపై పూజలు చేశారు. విలువల్లేని రాజకీయాలకు పాల్పడుతున్న చంద్రబాబుకు మంచి గుణాన్ని ప్రసాదించాలని స్వామిని ప్రార్థించినట్టు తెలిపారు. లడ్డూ కల్తీపై సీబీఐ విచారణ చేయించాలని అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. అనంతరం ఆయన 59వ వార్డు మాజీసైనికుల కాలనీ కొండపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు చేశారు. ఉపమేయర్ జియ్యాని శ్రీధర్ గొల్లకంచరపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

భక్తులకు క్షమాపణలు చెప్పాలి : తెదేపా

గాజువాక, న్యూస్‌టుడే : తిరుమల పవిత్రతకు భంగం కలిగేలా వ్యవహరించిన గత వైకాపా పాలకులు వెంటనే శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పాలని తెదేపా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గాజువాక తెదేపా కార్యాలయంలో శ్రీవారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించినట్టు నివేదికలు బయటకు రావడంతో... ప్రజలంతా వైకాపా నాయకుల్ని అసహ్యించుకుంటున్నారన్నారు. నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, తమిరె శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింధియా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 59వ వార్డు మాజీసైనికుల కాలనీ కొండపై ఉన్న వెంకటేశ్వరస్వామిని శనివారం వైకాపా నాయకులు దర్శించుకోవడంతో.. ఆలయ పవిత్రత దెబ్బతిందని కూటమి నాయకులు ఆరోపించారు. వెంటనే సంప్రోక్షణ చర్యలు చేపట్టారు. పసుపు నీళ్లతో ఆలయ ప్రాంగణాన్ని, మెట్లను శుభ్రం చేశారు. నాయకులు మితిరెడ్డి శంకర్, పూడి భాస్కర్, శ్రీను, సురేష్, ఈశ్వరరావు, శ్రీనివాస్, గురుమూర్తి, ఎల్.రామకృష్ణ పాల్గొన్నారు.


గాజువాకలో క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా కార్యకర్తలు


మాజీసైనికుల కాలనీ కొండపై ఆలయంలో..

● **పట్టాల రిజిస్ట్రేషన్‌కు విన్నపం**

అగనంపూడి, న్యూస్‌టుడే : ఫార్మాసిటీ నిర్వాసితులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను తక్షణమే రిజిస్ట్రేషన్ చేయాలని అగనంపూడి ప్రాంత కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం లంకెలపాలెం సబ్ రిజిస్ట్రార్ ఎం.అప్పారావును కలిసి వినతి అందించారు. కూటమి నాయకులు బి.సత్యనారాయణ, కె.బాబూరావు, బి.అప్పారావు, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.